www.trinetnews.com

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 92 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం నవంబర్ 03, 2026 పేజీలు:12 వెల.10/-

దేశాన్ని భాజపా 'అదానీ'కరణ చేస్తోంది: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: కాంగ్రెస్‌ను విమర్శించడానికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన పరిమితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ (ꯒꯨꯡꯁꯤꯑꯣꯏꯍꯟ ꯒꯥꯡꯍꯪꯂꯤꯎꯁꯨꯡꯍꯪꯂꯤ) విమర్శించారు. తెలంగాణ విభజన హామీలపై ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చొరబాటుదారుల ఓటు హక్కుకు తాము వ్యతిరేకమన్న ఆయన.. కాంగ్రెస్‌పై భాజపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందన్నారు.“ దేశంలో ఏఏ (అంబానీ, అదానీ) ట్యాక్స్ నడుస్తోంది. ముగ్గురు గుజరాతీయుల కోసమే మోదీ, అమిత్ షా పని చేస్తున్నారు.





హైదరాబాద్ చెత్తపై సీఎం ఆదేశాలు

2 లో

చెత్త కనిపిస్తే చర్యలు తప్పవు!

- హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి: సీఎం రేవంత్
- నగరంలో ఎక్కడా చెత్త ఉండొద్దు!
- చెత్తపై ఉక్కుపాదం.. ట్రాఫిక్‌కు చెక్!
- సింగ్నల్ ఫ్రీ హైదరాబాద్‌కు కార్యాచరణ
- తాగునీటి వృథాకు స్వస్తి.. గ్రీన్ ట్యాంకర్ల విస్తరణ
- అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు ప్రణాళికలు

హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా, ట్రాఫిక్ సమస్యలు లేని ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. మరోవైపు తాగునీటి వృథాను అరికట్టేందుకు పార్కులు, నిర్మాణ పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని అందించే గ్రీన్ ట్యాంకర్ల సేవలను విస్తరించాలని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

భాగ్యనగరాన్ని పరిశుభ్రతలో దేశానికే ఆదర్శంగా నిలపడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించకూడదని, ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు.. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.



నకిలీ ఓట్లపై గురి.. కాంగ్రెస్‌పై అస్త్రం!

- ఓటరు జాబితా ప్రక్షాళనకు అమిత్‌షా పిలుపు
- రాహుల్--రేవంత్ ట్యాక్స్ అంటూ విమర్శలు
- తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం
- కాంగ్రెస్ పాలనపై అవినీతి ఆరోపణలు

హైదరాబాద్:

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్‌షా భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపా సర్కారు రావాలా... వద్దా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అరాచకత్వాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో భాజపా మహాపాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. అప్పట్లో నిజాం మెడలను సర్దార్ వల్లభాయ్ పటేల్ వంచబట్టే హైదరాబాద్ విముక్తి పొందిందన్నారు.

మిగతాద్ది 2 లో

మోదీ సర్కారుపై కుట్రలు.. బండి సంజయ్ ఆరోపణలు!

- మోదీ ప్రభుత్వాన్ని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయన్న బండి
- విదేశీ ఆర్థిక సాయంతో కుట్రలకు ప్రయత్నమని ఆరోపణ
- కాంగ్రెస్ తీరుపై కేంద్ర మంత్రి మండిపాటు
- 40 ప్రాంతాల్లో భారీ ర్యాలీలకు బీజేపీ సన్నాహాలు
- హైదరాబాద్ పాదయాత్రకు అమిత్‌షా హాజరు
- కరీంనగర్ ర్యాలీకి నితిన్ నబీన్ రాక



విదేశీ శక్తుల ఆర్థిక సాయంతో.. కాక్రోచ్ పార్టీ, నేహా బోరా వంటి అరాచక శక్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తూ.. మోదీ సర్కార్‌ను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కరీంనగర్‌లో ఈ నెల 5న నిర్వహించే మహార్యాలీకి సంబంధించి ఆదివారం కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.



2 లో

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 14 నెలల చిన్నారి మృతి

నిజాంపేట:

బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యశస్విని యోగిత (14 నెలలు) అనే చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు.




2లో..

పోలీసు కానిస్టేబుల్‌కే టోకరా.. రూ.29 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు.. సైబర్ క్రైమ్‌లో కేసు నమోదు!

సైబర్ నేరగాళ్ల వలలో ఓ పోలీస్ కానిస్టేబుల్ చిక్కుకుని ఏకంగా రూ.29.20 లక్షలు పోగొట్టుకున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా పరిచయమైన కేటుగాళ్లు డార్విన్‌ఎక్స్ గ్లోబల్ పేరిట నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లు, యాప్‌లతో భారీ మోసానికి పాల్పడ్డారు.జీరో కమిషన్, భారీ లాభాలు వస్తాయంటూ నమ్మబలికిన నిందితులు, సుకన్య రెడ్డి పేరిట చాటింగ్ చేస్తూ అప్పర్ సర్క్యూట్ ట్రేడింగ్ పేరుతో బాధితుడి నమ్మకాన్ని పొందారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే పాలమూరులో

కరువు పరిస్థితులు



2 లో

- శ్రీశైలం, జూరాల జలాల వినియోగంలో వైఫల్యం
- కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 50 టీఎంసీల నుంచి 18 టీఎంసీలకే పరిమితం
- తొలి పంట కూడా ఎండిపోయిందని హరీష్ రావు వ్యాఖ్య
- కరువు రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్
- యాసంగి రైతుబంధు విడుదల చేయాలని కోరిన మాజీ మంత్రి
- కరువు పరిస్థితుల పరిశీలనకు కేంద్ర బృందాన్ని పంపాలని విజ్ఞప్తి



2 లో

తెల్లాపూర్ లో హైడ్రా దూకుడు.. అక్రమంగా నీటిని తోడేస్తున్న వారిపై కొరడా

ఎల్ నినో కరువు పరిస్థితులల్లో అక్రమంగా బోర్లు వేసి నీటితో వ్యాపారం చేస్తున్న వారిపై హైడ్రా చర్యలు ప్రారంభించింది. తెల్లాపూర్‌లో అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు తీసుకుంది. అనుమతులు లేకుండా నీటిని తోడేస్తున్న వారిపై హైడ్రా కొరడా ఝుళిపించింది. 2026 నవంబర్ 2న తెల్లాపూర్‌లో రెండు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్లను తొలగించింది. పైపులతో సహా బోర్లను తొలగించి పూడ్చివేసింది.

దేశాన్ని 'అదానీకరణ' చేస్తున్న మోదీ సర్కార్!

- ముగ్గురు గుజరాతీయుల కోసమే మోదీ, అమిత్ షా: పొన్నం
- కాంగ్రెస్‌పై విమర్శలేంటి.. విభజన హామీల సంగతేంటి?
- దేశంలో ఏఏ ట్యాక్స్ నడుస్తోంది!
- అదానీకి అన్నీ కట్టబెడుతున్నారు: పొన్నం ప్రభాకర్
- ఎల్‌నినో, కరువుపై కేంద్రం స్పందించాలి



హైదరాబాద్:

కాంగ్రెస్‌ను విమర్శించడానికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన పరిమితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్‌విమర్శించారు. తెలంగాణ విభజన హామీలపై ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చొరబాటుదారుల ఓటు హక్కుకు తాము వ్యతిరేకమన్న ఆయన.. కాంగ్రెస్‌పై భాజపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందన్నారు.

“ దేశంలో ఏఏ (అంబానీ, అదానీ) ట్యాక్స్ నడుస్తోంది. ముగ్గురు గుజరాతీయుల కోసమే మోదీ, అమిత్ షా పని చేస్తున్నారు. అన్నీ అదానీకి కట్టబెడుతున్నారు.. దేశాన్ని 'అదానీకరణ' చేస్తున్నారు. మీ హామీల గురించి బహిరంగ చర్చకు మీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమా? ఎల్‌నినో ప్రభావం, కరవుపై కేంద్రం సహాయం చేయాలి. పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలి” అని పొన్నం డిమాండ్ చేశారు.

గ్లోబల్ సమ్మిట్‌కు 2 వేల మంది ప్రతినిధులు!

- నవంబర్ 20 నాటికి స్కిల్ యూనివర్సిటీ పనులు పూర్తి!
- గ్లోబల్ సమ్మిట్‌కు హైదరాబాద్ ముస్తాబు
- పెట్టుబడులే లక్ష్యం.. సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు
- గత రికార్డు దాటేలా గ్లోబల్ సమ్మిట్: మంత్రి వివేక్
- శాశ్వత నిర్మాణాల్లోనే సమ్మిట్ నిర్వహణ



2 లో

హైదరాబాద్:

డిసెంబర్ 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు స్కిల్ యూనివర్సిటీని సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది గ్లోబల్ సమ్మిట్ కోసం తాత్కాలిక నిర్మాణాలకు భారీగా ఖర్చు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఈసారి ఎలాంటి అదనపు ఖర్చులు లేకుండా శాశ్వత నిర్మాణాల్లోనే సమ్మిట్ నిర్వహించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పనులను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. గత నాలుగు నెలలుగా నిర్మాణ పనులను ముమ్మరం చేశామని, ముగ్గురు కాంట్రాక్టర్లను సమన్వయం చేస్తూ మెటీరియల్, కార్మికులు, ఎలక్ట్రిఫికేషన్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు 2 వేల మంది ప్రతినిధులు!

మొదటిపేజీ తరువాయి

గ్లోబల్ సమ్మిట్‌కు సుమారు 2 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ల్యాబ్-1లో ఆరు, అకాడమిక్ బ్లాక్‌లో మూడు సెమినార్ హాళ్లను సిద్ధం చేశామని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశాల నిర్వహణ కోసం మరో 13 గదులను అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఈసారి అంతకంటే ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, టాటా సంస్థ సహకారంతో రూ.4 వేల కోట్ల వ్యయంతో మరో 54 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా విద్యార్థులకు స్టైఫండ్‌తో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు.

నిర్దేశిత గడువులోగా పనుల పూర్తి

స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు నవంబర్ 15 నాటికి 90 శాతం పూర్తవుతాయని మంత్రి వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధులు వచ్చేలోగా, నవంబర్ 20 నాటికి అన్ని ఫినిషింగ్ పనులను పూర్తి చేసి యూనివర్సిటీని పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. సమ్మిట్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని

నకిలీ ఓట్లు తొలగించాలా.. వద్దా?: అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఓటు బచావో ర్యాలీలపై అమిత్ షా విమర్శలు గుప్పించారు.“ కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదు.. చొరబాటుదారులను కాపాడే ర్యాలీ. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వం. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా.. వద్దా? ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలా.. వద్దా? కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు తొలగించాలా.. వద్దా? దేశంలో లేని వారి ఓట్లే 3 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ చొరబాటుదారుల ఓట్లు తొలగించాలా.. వద్దా? ఎస్ఐఆర్ వల్ల మేము గెలిచామని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2014, 2019 ఎన్నికలప్పుడు ఎస్ఐఆర్ లేదు.. అప్పుడు మోదీ గెలవలేదా?ఈవీఏంలు ట్యాంపరింగ్ జరిగితే రేవంత్ రెడ్డి ఎలా ముఖ్యమంత్రి అయ్యారు. కొన్నేళ్లుగా భాజపాకి దేశంలో ఆదరణ పెరుగుతోంది” అని అమిత్ షా అన్నారు.

10 ఏళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి

ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. “ ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నా. ఈవీఎంల ద్వారా మేము గెలిస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది. కేరళ, తమిళనాడులో భాజపాయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి? కాంగ్రెస్ పార్టీని దేశమంతా ఛీ కొడుతోంది. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగింది. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉంది. ఇలాంటి పార్టీ మోదీతో పోటీపడుతుందా? ఆయనతో పరుగుపందెంలో పాల్గొనగలదా? కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల అవినీతి రాజ్యమేలుతోంది.

డ్రగ్స్ రహిత దేశంగా భారత్

తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. ఇక్కడ రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఇక్కడి ఆర్ఆర్ ట్యాక్స్ ఎక్కడికి వెళ్తోంది? రాహుల్ కోసమే ఇక్కడ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ అవినీతిని ఒవైసీ ఆపుతారా.. బీఆర్ఎస్ ఆపుతుందా? కాంగ్రెస్ అవినీతిని కేవలం భాజపా మాత్రమే ఆపగలదు. త్వరలోనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తాం. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? మేం ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటాం. తెలంగాణలో భాజపా సర్కార్ వచ్చేందుకు మాకు అండగా ఉండాలి.” అని

చెత్త కనిపిస్తే చర్యలు తప్పవు!

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా నగరంలోని చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశ్రామిక ప్రాంతాల్లో పారిశుధ్యం వంటి అంశాలపై చర్చించారు. నగరంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

కేవలం చెత్త సేకరణకే పరిమితం కాకుండా, సేకరించిన వ్యర్థాలను సక్రమంగా తరలించే బాధ్యతను కూడా అధికారులు తీసుకోవాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపించే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో భవన నిర్మాణాలు, రోడ్ల పనుల కారణంగా వెలువడే వ్యర్థాలు కూడా పారిశుధ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో నిర్మాణ వ్యర్థాలను పడేయకుండా తగిన పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలోని నివాస ప్రాంతాలతో పాటు పారిశ్రామిక ప్రాంతాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగరంలో తాగునీటి వినియోగాన్ని తగ్గించి, శుద్ధి చేసిన మురుగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగించడంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్ వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగించకుండా శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సూచించారు.
ఇందుకోసం జలమండలి ప్రారంభించిన గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ ఈ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. పార్కులు, నిర్మాణ సంస్థలు, గ్రీనరీ నిర్వహణ చేపట్టే సంస్థలకు గ్రీన్ వాటర్ వినియోగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఇలా చేయడం ద్వారా ఒకవైపు తాగునీటిని ఆదా చేయడంతో పాటు మరోవైపు శుద్ధి చేసిన నీటిని సమర్థంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ నగరవాసులు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య ట్రాఫిక్ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరిగి వచ్చే వేళ ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సిగ్నళ్ల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

కంటికి శుభ్రంగా కనిపించే నీరు ఎల్లప్పుడూ స్వచ్ఛమైనది కాకపోవచ్చు: భారతదేశంలో మారుతున్న నీటి నాణ్యత, విశ్వసనీయమైన శుద్ధి అవసరం
ఇది చదివారా:
కంటికి శుభ్రంగా కనిపించే నీరు ఎల్లప్పుడూ స్వచ్ఛమైనది కాకపోవచ్చు: భారతదేశంలో మారుతున్న నీటి నాణ్యత, విశ్వసనీయమైన శుద్ధి అవసరం

హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడం కోసం అవసరమైన ప్రాంతాలను గుర్తించి అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ చెప్పారు. వాహనాలు సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిలిచిపోకుండా నిరంతరాయంగా రాకపోకలు సాగించేలా రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ రెండూ కీలకంగా మారాయి.

ఒకవైపు చెత్త సమస్యను నియంత్రిస్తూ, మరోవైపు రహదారులపై ప్రయాణ సమయాన్ని తగ్గించేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సంబంధిత శాఖలు ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తాయో.. నగరంలో ఈ మార్పులు ఎప్పటి నుంచి కనిపిస్తాయో వేచి చూడాల్సి ఉంది. హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో ఎంతవరకు సాకారమవుతుందన్నది ఇప్పుడు

హైదరాబాద్ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

అందరికీ అందుబాటులోకి పుష్పక్ ఏసీ బస్సులు.. క్యాబ్ ఖర్చులు తగ్గినట్టే!

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్‌బీ నగర్, ఉప్పల్, అమీర్‌పేట్, మెహదీపట్నం వంటి రద్దీ ప్రాంతాల మీదుగా ఈ పుష్పక్ ఏసీ బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. ఇప్పటివరకు సాధారణ ప్రయాణికులు ఏసీ రవాణా కోసం క్యాబ్‌లు లేదా ఆటోలపై ఆధారపడి ఎక్కువ డబ్బులు వెచ్చించేవారు. ఇప్పుడు పుష్పక్ బస్సుల్లో నగర ప్రయాణాలకు అనుమతి ఇవ్వడం వల్ల అత్యంత సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణం తక్కువ ధరలోనే అందుబాటులోకి వచ్చింది.

రూట్ల వివరాలు, ప్రధాన స్టాప్‌లు:
ఈ పుష్పక్ బస్సులు నగరంలోని ప్రధాన ప్రాంతాలను కలుపుతూ నడుస్తాయి.
సికింద్రాబాద్ -- ఏర్‌పోర్ట్ రూట్: తార్నాక, ఉప్పల్,



ఎల్‌బీ నగర్ మీదుగా.
గచ్చిబౌలి / వేవ్‌రాక్ రూట్: ఐటీ ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడే మార్గాలు.

ఈ మార్గాల్లో ఉన్న అన్ని అధీకృత బస్ స్టాప్‌లలో పుష్పక్ బస్సులు ఆగుతాయి. ప్రయాణికులు తమ గమ్యస్థానానికి అనుగుణంగా టికెట్ తీసుకుని ప్రయాణించవచ్చు.

చౌకైన ఛార్జీలు, సౌకర్యాలు:

పుష్పక్ బస్సులలో అధునాతన ఏసీ సౌకర్యం, సౌకర్యవంతమైన సీటింగ్, లగేజ్ ఉంచుకోవడానికి విశాలమైన స్థలం ఉంటుంది. సాధారణ ప్రైవేట్ ఏసీ రవాణా సాధనాలతో పోలిస్తే ఆర్టీసీ నిర్ణయించిన ఛార్జీలు చాలా అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులు డిజిటల్ పేమెంట్లు (UPI) లేదా టికెట్ కండక్టర్ల వద్ద నేరుగా నగదు చెల్లించి టికెట్లు పొందవచ్చు.

TGSRTC తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రోజువారీ ఉద్యోగులకు, ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన వారికి ప్రయాణం మరింత సులభతరం కానుంది. హైదరాబాద్ నగరవాసులు ఈ ఏసీ బస్సు సేవలను వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

రూ.1.50 కోట్ల చిట్టీల మోసం.. కష్టార్జితం కోల్పోయిన బాధితులకే ఐపీ నోటీసులు.. సిద్దిపేటలో తీవ్ర కలకలం!

సిద్దిపేట జిల్లాలో నమ్మకమే పెట్టుబడిగా సాగిన చిట్టీల వ్యాపారం తీవ్ర విషాదాన్ని, వివాదాన్ని మిగిల్చింది. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు కూడబెట్టుకున్న సుమారు రూ.1.50 కోట్ల సొమ్మును ఓ వ్యాపారి టోకరా వేసిన ఘటన చేర్యాల పట్టణ శివారులోని బీడీ కాలనీలో వెలుగులోకి వచ్చింది. బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించాల్సింది పోయి, ఏకంగా కోర్టు ద్వారా వారికే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ నోటీసులు పంపించడంతో బాధితులు తీవ్ర ఆగ్రహంతో ఆందోళనకు దిగారు.
నమ్మకమే పెట్టుబడిగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ సుమారు 1.50 కోట్ల మేర టోకరా వేసిన ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగులోకి వచ్చింది..దీనికి తోడు చిట్టీలు కట్టి మోసపోయిన బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించాల్సింది పోయి..ఆ నిర్వాహకుడు కోర్టు ద్వారా బాధితులకే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసులు పంపడం వివాదాస్పదంగా మారింది.దీంతో తమ కష్టార్జితం కోల్పోయిన బాధితులు ఆదివారం నిర్వాహకుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు.పూర్తి వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ శివారులోని బీడీ కాలనీ కేంద్రంగా మహ్మద్ అజీజ్ అహ్మద్ కొంతకాలంగా అనధికారికంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు.ప్రారంభంలో లావాదేవీలు సజావుగా సాగడంతో కాలనీవాసులు అతడిని నమ్మి పెద్ద సంఖ్యలో చిట్టీలు వేశారు. ఆడపిల్లల పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణాలు, కుటుంబ అవసరాల కోసం పైసాపైసా కూడబెట్టుకున్న డబ్బులను చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టారు. అయితే కొంతకాలం తర్వాత చిట్టీలు ఎత్తుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా నిర్వాహకుడు జాప్యం చేయడం మొదలుపెట్టాడు..ఇతర సభ్యులు వాయిదాలు చెల్లించడం లేదంటూ సాకులు చెబుతూ కాలయాపన చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.బాధితులకే ఐపీ నోటీసులు..తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితులు ఒత్తిడి పెంచడంతో నిర్వాహకుడు అజీజ్ అహ్మద్ కోర్టును ఆశ్రయించాడు...తాను ఆర్థికంగా నష్టపోయానని, అప్పులు తీర్చే స్థోమత లేదని పేర్కొంటూ ఇన్‌సాల్వెన్సీ పిటిషన్

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 14 నెలల చిన్నారి మృతి

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా మాచవరం మండలానికి చెందిన అరుణ్‌కుమార్, ప్రసన్న దంపతుల ఏకైక కుమార్తె యోగిత. అరుణ్ ఉద్యోగ రీత్యా ఖతార్‌లో ఉంటున్నారు.

కాగా, బాచుపల్లి పరిధిలోని జీపీఆర్ లే అవుట్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు ప్రవీణ్ ఇంటికి.. ఆదివారం ప్రసన్న తన కుమార్తెతో కలిసి వచ్చారు. అదే రోజు రాత్రి ఇంట్లోని పెంపుడు కుక్కతో ఆడుకుంటుండగా చిన్నారి కిందపడింది. దీంతో కుటుంబసభ్యులు చిన్నారిని బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శస్త్ర చికిత్స చేసిన వైద్యులు.. సోమవారం ఉదయం చిన్నారి మృతి చెందినట్లు వెల్లడించారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.

మోదీ సర్కారుపై కుట్రలు..బండి సంజయ్ ఆరోపణలు!

మొదటిపేజీ తరువాయి

అరాచక శక్తుల కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే పాదయాత్రలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కరీంనగర్‌లో జరిగే ర్యాలీకి భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రానున్నారని వెల్లడించారు. అమిత్‌షా పాదయాత్రకు సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, హైదరాబాద్ పరిధిలో నలుగురు ఎంపీలు జనసమీకరణ చేస్తున్నారని వివరించారు.

రైతులను ఆదుకోవడంలో రేవంత్ విఫలం: హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాలమూరు ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఎనిమిదేళ్ల పాటు రెండు పంటలు పండిన ప్రాంతంలో ఈసారి తొలి పంట కూడా ఎండిపోయిందని అన్నారు.

“కృష్ణా నీటిని ఎత్తకుండా పాలమూరుకు కరువు తీసుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ పంటలు ఎండిపోలేదు. ప్రజలకు భరోసా ఇవ్వడంలో రేవంత్ రెడ్డి విఫలం అయ్యారు. కాంగ్రెస్ నిర్లక్ష??యంతోనే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వచ్చాయి. కాంగ్రెస్ చేసిన పాపం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల సంక్షేమం సీఎం రేవంత్‌కు పట్టదని, కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు” అని హరీష్ రావు మండిపడ్డారు.

అంతేకాదు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 50 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరువుతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం, యాసంగి రైతుబంధు అందించాలని ఆయన కోరారు.

కరువు మండలాల ప్రకటనకే ప్రభుత్వం పరిమితమైందని, కరువు పరిస్థితులను పరిశీలించేందుకు తక్షణమే కేంద్ర బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. రైతులకు ధైర్యం చెప్పేందుకే తాము పర్యటిస్తున్నామని తెలిపారు.

పోలీసు కానిస్టేబుల్‌కే టోకరా.. రూ.29 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు.. సైబర్ క్రైమ్‌లో కేసు నమోదు!

మొదటిపేజీ తరువాయి

దశలవారీగా పెట్టుబడులు పెట్టించేలా చేసి బాధితుడి నుంచి రూ.29,20,659 కొల్లగొట్టారు. యాప్‌లో ఏకంగా రూ.76 లక్షల లాభం వచ్చినట్లు చూపిస్తూ బాధితుడిని మరింతగా నమ్మించారు. అయితే డబ్బులు విత్‌డ్రా చేసుకునే సమయంలో ట్యాక్స్, ఎక్స్చేంజ్ ఛార్జీలు అంటూ అదనంగా భారీ మొత్తంలో నగదు చెల్లించాలని డిమాండ్ చేయడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించారు.

ఈ ఘటనపై బాధిత పోలీస్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. +1 (425) 880-2035, +91 9214807284 నంబర్లతో పాటు నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు, బ్యాంకు లావాదేవీలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లాపూర్ లో హైడ్రా దూకుడు.. అక్రమంగా నీటిని తోడేస్తున్న వారిపై కొరడా

మొదటిపేజీ తరువాయి

అదే విధంగా 6 వాటర్ సంపులను ధ్వంసం చేశారు అధికారులు. వాటర్ ట్యాంకులను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

భూగర్భ జలాలను అక్రమంగా తోడేసి వ్యాపారం చేస్తున్న వారిపై గత కొంత కాలంగా నిఘా పెట్టిన హైడ్రా.. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరిస్తూ వ స్తోంది. అక్రమ నీటి దందాతో స్థానికులకు నీటి కొరత ఏర్పడుతున్న క్రమంలో యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టింది.
మరోవైపు వాటర్ ట్యాంకర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో స్థానికుల ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులను స్వీకరించిన హైడ్రా.. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటోంది. అక్రమ నీటి దందా కారణంగానే.. ట్యాంకర్ల ర్యాష్ డ్రైవింగ్ ఎక్కువైందని భావిస్తున్నారు. అదేసమయంలో చెరువులు, కుంటల పరిధిలో అక్రమ నీటి దందాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్తి కోసం తమ్ముడి భార్య దారుణ హత్య

ఆస్తి కోసం సొంత తమ్ముడి భార్యను హత్య చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. సీఐ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలం ఓబులాయపల్లికి చెందిన సునీత (28)కు కోయిలకొండ మండలం చింతల్‌తండాకు చెందిన బలరాంతో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి రిషిక, శైలజ అనే ఇద్దరు కుమార్తెలు. బలరాం మతిస్థిమితం సరిగ్గా లేదు. దీంతో ఏడాది కిందట పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి ఎకరన్నర భూమిని సునీత పేరిట పట్టా చేయించారు. ఇది బలరాం ఇద్దరు అన్నలు పాండునాయక్, మన్యానాయక్‌కు నచ్చలేదు. దీంతో భార్యాభర్తలను కాపురం చేయనిచ్చేవారు కాదు. బలరాంను తరచూ వారి వెంట హైదరాబాద్‌కు తీసుకెళ్లేవారు. విసుగు చెందిన సునీత పుట్టింటికి వెళ్లారు. తల్లిదండ్రులు నచ్చజెప్పి, చింతల్‌తండాలోనే వేరే ఇల్లు నిర్మించడంతో నెల రోజులుగా అక్కడే ఉంటున్నారు. ఆమె బావలు ఇంటికి వెళ్లి భూమి ఇవ్వబోమని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేదంటే చంపేస్తామని బెదిరించేవారు. సోమవారం మధ్యాహ్నం మామ మాణిక్యనాయక్, బావలు, మన్యానాయక్, పాండునాయక్, ఆయన భార్య పార్వతి కలిసి సునీత ఇంటికి వచ్చారు. గొంతుకు తెల్లటి పంచె కట్టి వారి ఇంటికి లాక్కొని వెళ్లారు. హత్య చేశారు.


మురసు తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తీవ్ర ప్రభావం.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 2:

అర్నబ్ తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మురసు తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మురసు తుపాను నేపథ్యంలో తన పరిధిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేస్తూ పోలీస్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో అధికారులు తుపాను కదలికలు, వాతావరణ పరిస్థితులను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. తొలుత బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం దాటుతుందని అంచనా వేసిన మురసు తుపాను ప్రస్తుతం దిశ మార్చుకుని నెల్లూరుకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని వివరించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మధ్యాహ్నం తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని చెప్పారు.



అత్యంత భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు

తుపాను ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కొట్టుకుపోయినా వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రోడ్లపై చెట్లు కూలిన సందర్భాల్లో తక్షణమే తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని తెలిపారు. ప్రమాదకరమైన రహదారులు, లోలెవల్ కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఉద్ధృతంగా ప్రవహించే ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతో పాటు వర్షాలు తగ్గిన వెంటనే బ్లీచింగ్, క్లోరినేషన్ నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

విద్యుత్, వైద్య సేవలకు అంతరాయం కలగొద్దు

తుపాను గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు పెద్ద సంఖ్యలో నేలకొరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పవన్ కళ్యాణ్ సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో వీలైనంత త్వరగా పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు

తుపాను ప్రభావం పూర్తిగా తగ్గి అధికారులు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలు బీచ్‌ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో పంట నష్టం తగ్గించేందుకు రైతులకు ముందస్తు సూచనలు చేయాలని, పంటలు నీట మునిగిన ప్రాంతాల్లో వర్షపు నీటిని వెంటనే బయటకు మళ్లించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అర్నబ్ తుపాను సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మురసు తుపానును కూడా సమర్థంగా ఎదుర్కోవాలని పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరవేయాలని, ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిష్ఠాత్మకంగా 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిర్వహణ

అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయాలి.. తెలంగాణ సంస్కృతి, ప్రగతిని చాటేలా ప్రత్యేక పెవిలియన్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 2:

85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు జరగనున్న ఈ సదస్సును అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ నెల 19న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఐఆర్‌సీ సదస్సును ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, అన్ని రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు, వివిధ దేశాల ప్రతినిధులు, ఇతర రాష్ట్రాల డెలిగేట్లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అతిథుల వసతి, రవాణా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు.



తెలంగాణ సంస్కృతి, ప్రగతిని చాటేలా పెవిలియన్

ఐఆర్‌సీ సదస్సుకు వచ్చే జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు తెలంగాణ ప్రత్యేకతను పరిచయం చేసేలా ప్రత్యేకంగా 'తెలంగాణ పెవిలియన్' ఏర్పాటు చేయాలని కోమటిరెడ్డి సూచించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగంలో సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా పెవిలియన్‌ను తీర్చిదిద్దాలని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కూడా ప్రతినిధులకు వివరించేలా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం

ఐఆర్‌సీ సదస్సుపై అన్ని మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ విమానాశ్రయం, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రజా రవాణా కేంద్రాల్లో హోర్డింగులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక విజువల్ ప్రకటనలు ప్రదర్శించాలని సూచించారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లోని విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లలోనూ ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. దేశవ్యాప్తంగా తెలంగాణలో జరగనున్న ఐఆర్‌సీ సదస్సుపై ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ప్రచార వ్యూహాన్ని రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఇన్వెస్ట్ తెలంగాణకు ప్రీ సమ్మిట్‌గా ఐఆర్‌సీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ (ఇన్వెస్ట్ తెలంగాణ)కు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ఒక ప్రీ-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌గా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఐఆర్‌సీకి హాజరయ్యే కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామిక రంగ ప్రముఖులకు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించాలని సూచించారు.

రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో తెలంగాణకు ఉన్న అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పడం ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఐఆర్‌సీ సదస్సు కేవలం సాంకేతిక సమావేశానికే పరిమితం కాకుండా తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలకు వేదికగా నిలిచేలా సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

మురసు తుఫానును సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు.. దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలపై సమీక్ష

అమరావతి, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 2:

కోస్తాంధ్ర తీరానికి అత్యంత సమీపంగా ఉన్న మురసు తుఫాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తుఫాను సన్నద్ధత, సహాయక చర్యలు, విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ, నీటి నిర్వహణపై రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) నుంచి అధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తుఫాను ప్రభావంపై అంచనాలను ముఖ్యమంత్రికి వివరించారు. దక్షిణ కోస్తాంధ్ర నుంచి దిగువ జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో వర్షాలు కురిసే అవకాశముండటంతో వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలోకి సుమారు 13 నుంచి 15 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని



అంచనా వేసినట్లు వెల్లడించారు.

గతంలో అర్నబ్ తుఫాను కారణంగా జరిగిన విధ్వంసం నుంచి చాలా ప్రాంతాలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే మరో తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అప్రమత్తతను ఏమాత్రం తగ్గించకుండా మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

అర్నబ్ తుఫాను సమయంలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మురసు తుఫాను గాలుల ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సుమారు 8 వేల విద్యుత్ స్తంభాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా విద్యుత్ శాఖ సిబ్బంది, అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సీఎం సూచించారు. మరోవైపు తుఫాను వర్షాలను సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం సహా వివిధ ప్రాంతాల్లోని చెరువులను నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్ పరిధిలోని వివిధ రిజర్వాయర్లలోనూ సాధ్యమైనంత మేర నీటిని నిల్వ చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. మురసు తుఫానును ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఇప్పటికే సిద్ధంగా ఉందని అధికారులు వివరించగా, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అక్టోబర్‌లో బొగ్గు ఉత్పత్తి 42 శాతం వృద్ధి

క్యాప్టివ్, వాణిజ్య గనుల్లో 22.03 మిలియన్ టన్నుల ఉత్పత్తి

36 శాతం పెరిగిన బొగ్గు రవాణా.. కార్యకలాపాలు సాగిస్తున్న గనుల సంఖ్య 87కు చేరిక

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

దేశంలోని క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు గనులు ఉత్పత్తి, రవాణాలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. 2026 అక్టోబర్‌లో ఈ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి 22.03 మిలియన్ టన్నులకు చేరింది. గతేడాది ఇదే నెలలో నమోదైన 15.49 మిలియన్ టన్నులతో పోలిస్తే సుమారు 42 శాతం పెరిగింది. బొగ్గు రవాణా కూడా 15.48 మిలియన్ టన్నుల నుంచి 21.11 మిలియన్ టన్నులకు చేరి, సుమారు 36 శాతం వృద్ధి సాధించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బొగ్గు ఉత్పత్తి 117.23 మిలియన్ టన్నులుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఉత్పత్తి 105.33 మిలియన్ టన్నులు కాగా, ఈసారి 11.30 శాతం పెరిగింది. ఇదే సమయంలో బొగ్గు రవాణా 111.95 మిలియన్ టన్నుల నుంచి 124.86 మిలియన్ టన్నులకు చేరి, 11.53 శాతం వృద్ధిని నమోదు చేసింది.

గనుల నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం, ఉత్పాదకత పెరగడం, అందుబాటులో ఉన్న మైనింగ్ సామర్థ్యాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవడం ఈ ఫలితాలకు దోహదపడినట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ పేర్కొంది.

మరోవైపు జార్ఖండ్‌లోని లోహరి బొగ్గు గనికి అక్టోబర్‌లో గని ప్రారంభ అనుమతి లభించింది. కొన్నేళ్లుగా కార్యకలాపాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్న ఈ గనికి అనుమతి రావడం వ్యాపార సులభతర సంస్కరణల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో కార్యకలాపాలు సాగిస్తున్న క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు గనుల సంఖ్య 87కు చేరింది.

ఈ గనుల నుంచి పెరుగుతున్న ఉత్పత్తి దిగుమతి బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడానికి దోహదపడనుంది. పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన బొగ్గు లభ్యతను పెంచి, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనకు తోడ్పడనుంది.

దేశంలో పెరుగుతున్న ఇంధన, పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకు ఉత్పత్తి వృద్ధిని కొనసాగించడంపై దృష్టి సారిస్తామని బొగ్గు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విధానపరమైన చర్యలు, సమర్థమైన నియంత్రణ పర్యవేక్షణ, సంబంధిత వర్గాల సహకారంతో సరఫరా అవరోధాలను పరిష్కరించి బొగ్గు లభ్యతను మెరుగుపరుస్తామని తెలిపింది.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:



హైదరాబాద్‌లోని చారిత్రాత్మక శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్ సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించాలి

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు పొడిగించాలి.. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి వినతి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 2:

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) అధికారిక వెబ్‌సైట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యను తక్షణమే పరిష్కరించి, గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను పునరుద్ధరించాలని హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ నిన్నటి నుంచి పనిచేయడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ తీవ్రంగా ప్రభావితమవుతోందని సామా రామ్మోహన్ రెడ్డి వినతిపత్రంలో పేర్కొన్నారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చేసుకునేందుకు చివరి తేదీగా 2026 నవంబర్ 6ను నిర్ణయించిన నేపథ్యంలో, ఈ కీలక సమయంలో వెబ్‌సైట్ పనిచేయకపోవడం వల్ల వేలాది మంది అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును పొందే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సమస్యపై ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌ను వెంటనే పునరుద్ధరించి, ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్ ఓటరు నమోదు సేవలను తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వెబ్‌సైట్ పనిచేయని రోజుల సంఖ్యకు సమానంగా గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువును పొడిగించాలని కోరారు. సాంకేతిక సమస్యలు అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు హక్కుకు అడ్డంకిగా మారకూడదని, ప్రతి ఒక్కరికీ నమోదు చేసుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని సామా రామ్మోహన్ రెడ్డి తన వినతిపత్రంలో స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు వివాదాలకు

జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 2:



రెవెన్యూ, అటవీ (ఫారెస్ట్) భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు మరియు సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ..రెండు విభాగాల సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని...రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని , ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తిరిగి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వతంగా తెరపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్‌మెంట్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తోందని వెల్లడించారు.

భూ రికార్డులలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు.


సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పట్టుదలతో పనిచేసి దశాబ్దాల నాటి భూ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని మంత్రి సూచించారు. ఈ సర్వేకు క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు సహకరించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వైద్యులకు ప్రజారోగ్యంపై జాతీయస్థాయి శిక్షణ

కన్హా శాంతివనంలో రెండు రోజుల కార్యక్రమం
తొలి విడతలో తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 550 మంది భాగస్వామ్యం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

గిరిజన సమాజాల్లో ప్రజారోగ్యంపై అవగాహన పెంపొందించడం, సంప్రదాయ వైద్యులకు ఆధునిక ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానం కల్పించడం లక్ష్యంగా హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో జాతీయస్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భువనేశ్వర్‌లోని ఐసీఎంఆర్--జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ సంయుక్తంగా 'జన్‌హిట్' కార్యక్రమం కింద నవంబర్ 1, 2 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ తరహాలో తొలిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్, ఐసీఎంఆర్--ఎన్ఐహెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సంఘమిత్ర పతి ప్రారంభించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, డైరెక్టర్ బి.ఎం. సంతోష్, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ వి. సముజ్వలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జనజాతీయ గౌరవ పక్షోత్సవాల తొలి రోజున ఈ కార్యక్రమానికి శ్రీకారం



చుట్టారు. తొలి విడత శిక్షణలో ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, దాద్రా నగర్ హవేలీ నుంచి సుమారు 550 మంది గిరిజన సంప్రదాయ వైద్యులు పాల్గొంటున్నారు. ఆయా రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖలు వీరిని ఎంపిక చేశాయి. సాధారణ వ్యాధులపై అవగాహన కల్పించడం, ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించడం, అవసరమైన సందర్భాల్లో రోగులను సకాలంలో ఆసుపత్రులకు పంపించేలా మార్గనిర్దేశం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం.

రెండు రోజుల కార్యక్రమంలో మూడు శిక్షణ విభాగాల ద్వారా అంటువ్యాధులు, దోమలు తదితర వాహకాల ద్వారా వ్యాపించే వ్యాధులు, చర్మవ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, జీవక్రియ సంబంధిత సమస్యలు, రక్త సంబంధిత వ్యాధులు, కాలేయ వ్యాధులు, మానసిక ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పాముకాటు, తేలు కాటు, ఇతర విషకీటకాల కాట్లు, జంతువుల దాడులు, గాయాలు వంటి సందర్భాల్లో తగిన వైద్యసేవలకు పంపించాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. కంటి, చెవి సమస్యలు, నోటి ఆరోగ్యం, నవజాత శిశువులు, చిన్నారుల సంరక్షణపైనా శిక్షణ ఇస్తున్నారు.

పాల్గొనేవారికి సులభంగా అర్థమయ్యేలా రాష్ట్రాల వారీగా ప్రాంతీయ భాషల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఎయిమ్స్, ఐసీఎంఆర్, క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా, ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్, కొచ్చిలోని అమృత ఇన్‌స్టిట్యూట్, బెంగళూరులోని ఐఐహెచ్ఎంఆర్, మహారాష్ట్రలోని పిరమల్ స్వాస్థ్య సంస్థలకు చెందిన నిపుణులు శిక్షణ అందిస్తున్నారు.

గిరిజన సంప్రదాయ వైద్యుల సామాజిక పాత్రను గుర్తిస్తూ, ప్రజలకు సకాలంలో సరైన వైద్యం అందేలా అధికారిక ఆరోగ్య వ్యవస్థతో వారి సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. శిక్షణలో అభ్యాస కార్యక్రమాలు, పునశ్చరణ, శిక్షణానంతర మూల్యాంకనం, పాల్గొనేవారి అభిప్రాయాల సేకరణను చేర్చారు. నవంబర్ 2న ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నారు.

సిక్కింలో పాడి రంగం బలోపేతానికి కొత్త కార్యక్రమాలు

రూ.251.56 లక్షల ప్రాజెక్టులు, కార్యక్రమాలకు శ్రీకారం
నవంబర్ 2, 3 తేదీల్లో కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ పర్యటన

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

సిక్కింలో పాడి పరిశ్రమ అభివృద్ధి, పశుసంవర్ధక మౌలిక సదుపాయాల బలోపేతం లక్ష్యంగా కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ నవంబర్ 2, 3 తేదీల్లో గ్యాంగ్‌టక్, మాంగన్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రూ.251.56 లక్షల విలువైన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సమీక్షించనున్నారు. జాతీయ పాడి అభివృద్ధి కార్యక్రమం కింద సిక్కిం మిల్క్ యూనియన్‌కు ఏర్పాటు చేసిన సూక్ష్మజీవ శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించనున్నారు. శ్వేత విప్లవం 2.0 కింద 57 కొత్త పాడి సహకార సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో పాటు, కొత్తగా నమోదైన ఐదు సంఘాలకు రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు అందజేయనున్నారు. ఉత్తర సిక్కింలో మరో 15 కొత్త పాడి సహకార సంఘాల ఏర్పాటు కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.

గ్యాంగ్‌టక్, జోరెథాంగ్ ప్రాంతాల్లో తయారయ్యే 'చుర్పి' చీజ్ ఉత్పత్తుల మూలం, తయారీ వివరాలను గుర్తించేందుకు ట్రేసబిలిటీ కార్యక్రమాన్ని ఆవిష్కరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంస్థల పథకం కింద సిక్కిం మిల్క్ యూనియన్‌కు అనుబంధంగా రెండు 'ఫాడర్ ప్లస్' రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహించనున్నారు.



ఉత్పత్తుల వైవిధ్యీకరణ, విలువ జోడింపులో భాగంగా సేంద్రియ తేనె, వెర్రినువ్వుల గింజలు కలిపిన పొడి, చిరుధాన్యాలు, బక్‌వీట్‌తో తయారుచేసిన సేంద్రియ బిస్కెట్లు, మిఠాయిలను మంత్రి ఆవిష్కరించనున్నారు. స్థానిక ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి.

ఈ పర్యటనలో సిక్కిం ప్రభుత్వ ఉన్నతాధికారులు, మాంగన్ జిల్లా యంత్రాంగం, కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, జాతీయ పాడి అభివృద్ధి మండలి ప్రతినిధులు, పాడి రైతులు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పాల్గొననున్నాయి.

ఈశాన్య ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో సిక్కిం ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. 2024--25లో రాష్ట్ర పాల ఉత్పత్తి సుమారు 89.35 వేల మెట్రిక్ టన్నులుగా నమోదైంది. తలసరి రోజువారీ పాల లభ్యత సుమారు 352 గ్రాములుగా ఉంది. రాష్ట్రంలో పాడి రంగం అభివృద్ధికి 2014 నుంచి రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద కేంద్రం రూ.7,093.99 లక్షలు విడుదల చేసింది. స్థానిక 'సిరి' పశుజాతి అభివృద్ధి, సంరక్షణకు రూ.2,763.92 లక్షల ప్రత్యేక ప్రాజెక్టును మంజూరు చేసింది.

యాకల అభివృద్ధి, సంరక్షణ కోసం 2023--24లో రూ.100 లక్షలు విడుదల చేశారు. అధిక జన్యు నాణ్యత కలిగిన మగ యాకల కొనుగోలుకు ప్రస్తుత 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద మరో రూ.100 లక్షలు విడుదలయ్యాయి.

జాతీయ పాడి అభివృద్ధి కార్యక్రమం కింద సిక్కింలో రూ.59.60 కోట్ల వ్యయంతో తొమ్మిది ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో కేంద్ర వాటా రూ.54.61 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.53.59 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో రూ.52.61 కోట్లు వినియోగించారు.

జాతీయ పశుసంపద మిషన్ కింద 2020--21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు పశుగ్రాస ఉత్పత్తికి రూ.1,914.39 లక్షలు, పశువుల బీమాకు రూ.530.62 లక్షలు, గొర్రెలు, మేకలు, పందుల జాతి మెరుగుదలకు రూ.408.64 లక్షలు, శిక్షణ, విస్తరణ కార్యక్రమాలకు రూ.359.80 లక్షల ఆర్థిక సహాయం అందించారు.

మంత్రి పర్యటన సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలు పాడి రైతులు, పశుపోషకుల జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు సరఫరా వ్యవస్థ మెరుగుదలకు, అదనపు ఆదాయ అవకాశాల కల్పనకు దోహదపడనున్నాయి. స్థానిక ఉత్పత్తులకు ప్రీమియం, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశ అవకాశాలు పెంచడం ద్వారా రాష్ట్ర పాడి, పశుసంవర్ధక రంగాల సుస్థిర అభివృద్ధికి తోడ్పడనున్నాయి.

భారత్--ఈయూ వాణిజ్య బంధం బలోపేతంపై చర్చలు

బ్రస్సెల్స్‌లో యూరోపియన్ కమిషన్ ఉన్నతాధికారులతో రాజేశ్ అగర్వాల్ సమావేశాలు
మార్కెట్ అవకాశాలు, కస్టమ్స్ సహకారం, హరిత సాంకేతికతపై దృష్టి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

భారత్--యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ బ్రస్సెల్స్‌లో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. యూరోపియన్ కమిషన్ అధికారులు, పారిశ్రామిక ప్రతినిధులతో జరిగిన చర్చల్లో వాణిజ్య సులభతరం, మార్కెట్ ప్రవేశ అవకాశాలు, సరఫరా వ్యవస్థల పటిష్ఠత, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

యూరోపియన్ కమిషన్ వాణిజ్య, ఆర్థిక భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ డిట్టో జూల్ జోర్గెన్సెన్‌తో సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించే చర్యలపై చర్చించారు. భారత్, ఈయూ వ్యాపార సంస్థలకు కొత్త అవకాశాలు కల్పించడం, మార్కెట్ ప్రవేశాన్ని మెరుగుపరచడం, సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం వంటి అంశాలను పరిశీలించారు. న్యాయమైన, సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకర ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయి. మిగిలిన ప్రక్రియాపరమైన, అమలు సంబంధిత అంశాల పరిష్కారానికి నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని అంగీకరించాయి.

అంతర్జాతీయ భాగస్వామ్యాల విభాగం డైరెక్టర్ జనరల్



కోయెన్ డోయెన్స్‌తో జరిగిన సమావేశంలో భారత్--ఈయూ అభివృద్ధి సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు. సుస్థిర అభివృద్ధి, స్వచ్ఛ ఇంధనం, హరిత సాంకేతికతతో పాటు అనుబంధ రంగాల్లో సహకారాన్ని విస్తరించే అవకాశాలపై చర్చించారు.

పన్నులు, కస్టమ్స్ యూనియన్ విభాగం డైరెక్టర్ జనరల్ గెరాసిమోస్ థామస్‌తో సమావేశంలో కస్టమ్స్ సహకారం, వాణిజ్య సులభతరం, భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుకు సంబంధించిన సన్నాహాలపై దృష్టి సారించారు. వ్యాపార లావాదేవీల వ్యయాన్ని తగ్గించేందుకు, చట్టబద్ధమైన వాణిజ్యం సాఫీగా సాగేందుకు సమర్థమైన, పారదర్శకమైన, డిజిటల్ కస్టమ్స్ విధానాలు అవసరమని ఇరుపక్షాలు గుర్తించాయి.

రాజేశ్ అగర్వాల్ వజ్రాల పరిశ్రమ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. ఆంట్వెర్ప్ వజ్రాల వ్యాపార రంగానికి చెందిన ప్రతినిధులతో ప్రపంచ వజ్రాల విలువ గొలుసు, ధ్రువీకరణ ప్రమాణాలు, వజ్రాల మూలాన్ని గుర్తించే విధానాలు, బాధ్యతాయుత సేకరణపై చర్చించారు. భారత్‌లో విస్తరిస్తున్న వజ్రాల మార్కెట్, తయారీ రంగం అందిస్తున్న అవకాశాలను వివరించారు. రత్నాభరణాల రంగాన్ని మరింత సహకారానికి కీలక రంగంగా భారత్, బెల్జియం గుర్తించాయి. ఆంట్వెర్ప్, ముంబై, సూరత్ ప్రధాన వజ్రాల కేంద్రాలుగా నిలుస్తున్నాయి.

యూరోపియన్ పారిశ్రామిక ప్రతినిధులతో బిజినెస్‌యూరప్ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ వాణిజ్య కార్యదర్శి పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ, మార్కెట్ ప్రవేశ అవకాశాల మెరుగుదల, సరఫరా వ్యవస్థల బలోపేతం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పరిధిలో సహకారంపై చర్చించారు. భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధి, కొనసాగుతున్న సంస్కరణలు, కీలక రంగాల్లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. భారత్‌తో వ్యాపార సంబంధాలను విస్తరించి, అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల్లో భాగస్వాములు కావాలని యూరోపియన్ సంస్థలను ఆహ్వానించారు.

ఈ సమావేశాలు వాణిజ్యం, పెట్టుబడులు, అభివృద్ధి భాగస్వామ్యం, పన్నులు, కస్టమ్స్ రంగాల్లో భారత్--ఈయూ సహకారం విస్తరిస్తున్న తీరును ప్రతిబింబించాయి. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరుపక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో డీపీఐఐటీ పురోగతి

ప్రత్యేక ప్రచారం--6 కింద 99 శాతానికిపైగా ఫిర్యాదుల పరిష్కారం
గుర్తించిన ఈ--ఫైళ్లలో 83 శాతం ముగింపు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

కార్యాలయాల్లో పరిశుభ్రతను నిత్య విధానంగా మార్చడం, పెండింగ్ పనులను తగ్గించడం లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక ప్రచారం--6లో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) గణనీయమైన పురోగతి సాధించింది. అక్టోబర్ 28 నాటికి గుర్తించిన ప్రజా ఫిర్యాదుల్లో 99 శాతానికిపైగా పరిష్కరించడంతో పాటు, సమీక్షకు గుర్తించిన ఈ--ఫైళ్లలో సుమారు 83 శాతాన్ని ముగించింది.

పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) మార్గదర్శకత్వంలో డీపీఐఐటీ, దాని అనుబంధ, అధీన కార్యాలయాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర మంత్రివర్గం, పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన పెండింగ్ అంశాలతో పాటు ప్రజా ఫిర్యాదులు, వాటిపై అప్పీళ్లను గుర్తించి క్రమపద్ధతిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నాయి.


అక్టోబర్ 28 నాటికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అందిన అంశాల్లో 50 శాతానికిపైగా పరిష్కరించినట్లు శాఖ తెలిపింది. కేంద్ర మంత్రివర్గం, అంతర్‌మంత్రిత్వ కమిటీ, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన అంశాల్లో సుమారు 75 శాతం పరిష్కరించింది. ప్రజా ఫిర్యాదులపై వచ్చిన అప్పీళ్లలోనూ 80 శాతానికిపైగా పరిష్కారం చూపింది.

రికార్డుల నిర్వహణను మెరుగుపరచడంలో భాగంగా గుర్తించిన ఈ--ఫైళ్లలో సుమారు 83 శాతాన్ని ముగించింది. ఈ చర్యలు కార్యాలయ పరిశుభ్రతతో పాటు అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు దోహదపడ్డాయని డీపీఐఐటీ పేర్కొంది.

ప్రత్యేక ప్రచారం--6కు సంబంధించిన సన్నాహక దశను సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు నిర్వహించారు. అనంతరం అక్టోబర్ 2 నుంచి 31 వరకు అమలు దశను చేపట్టారు. పరిశుభ్రత, సమర్థమైన రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలను సకాలంలో పరిష్కరించాల్సిన ప్రాధాన్యంపై ప్రభుత్వ ఉద్యోగుల్లో ఈ కార్యక్రమం అవగాహన పెంచింది. అనుబంధ, అధీన కార్యాలయాలన్నింటిలో పరిశుభ్రతను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ, పెండింగ్ పనులను తగ్గించేందుకు కట్టుబడి ఉన్నట్లు డీపీఐఐటీ వెల్లడించింది. మరింత సమర్థంగా, ప్రజల అవసరాలకు వేగంగా స్పందించే కార్యాలయ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపింది.

నౌకాదళానికి ఎనిమిది అత్యాధునిక యుద్ధనౌకలు

రూ.53,866.50 కోట్లతో జీఆర్ఎస్ఈ, జీఎస్ఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందాలు
స్వదేశీ రూపకల్పన, నిర్మాణంతో రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు ఊతం



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

భారత నౌకాదళం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఎనిమిది నెక్స్ట్ జనరేషన్ కార్వెట్ల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. మొత్తం రూ.53,866.50 కోట్ల విలువైన ఈ ఒప్పందాలను గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ), గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్)తో సోమవారం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్--2లో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో కుదుర్చుకున్నారు. ఒప్పందాల ప్రకారం జీఆర్ఎస్ఈ ఐదు కార్వెట్లను, జీఎస్ఎల్ మిగిలిన మూడు నౌకలను నిర్మించనున్నాయి. భారత నౌకాదళం స్వదేశీంగా రూపకల్పన చేసిన నౌకలను పోటీ ప్రక్రియ ద్వారా ఎంపికైన రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు నిర్మించనున్న తొలి ప్రాజెక్టు ఇదే. స్వదేశీ యుద్ధనౌకల రూపకల్పన, నిర్మాణ సామర్థ్యాల్లో ఈ ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

ఈ కొత్త తరం కార్వెట్లలో అత్యాధునిక క్షిపణులు, ఆయుధాలు, సెన్సర్ వ్యవస్థలను అమర్చనున్నారు. గగనతలం, సముద్ర ఉపరితలం, నీటి అడుగున ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనేలా వీటిని తీర్చిదిద్దనున్నారు. సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ, శత్రు నౌకలు, జలాంతర్గాములకు వ్యతిరేకంగా యుద్ధ కార్యకలాపాలు, తీరప్రాంత రక్షణలో ఇవి కీలకంగా వ్యవహరించనున్నాయి. తీర సమీప సముద్ర జలాల్లో పోరాట కార్యకలాపాలు, గస్తీ, నిఘా విధులను కూడా నిర్వహించనున్నాయి.

ఈ ప్రాజెక్టు దేశీయ నౌకా నిర్మాణ రంగానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించనుంది. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు షిప్‌యార్డులు, భారతీయ పారిశ్రామిక భాగస్వాములు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మధ్య సహకారం మరింత బలోపేతం కానుంది. వచ్చే పదేళ్లలో నౌకల నిర్మాణం ద్వారా షిప్‌యార్డుల్లో సుమారు 72 లక్షల పనిదినాలు, అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలలో మరో 460 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. దేశీయంగా తయారైన సామగ్రి, పరికరాలు, స్వదేశీ సాంకేతికత, భారతీయ నిపుణుల నైపుణ్యాలకు ఈ ప్రాజెక్టులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

రక్షణ ఉత్పత్తిలో స్వావలంబన సాధించేందుకు ఈ ఒప్పందాలు మరో కీలక అడుగుగా నిలవనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు మరింత బలం చేకూర్చనుంది.

వాయుసేన పాఠశాలల్లో చిన్నారుల డిజిటల్ భద్రతకు ప్రత్యేక కార్యక్రమం

'స్ర్కోల్‌కంట్రోల్' పరిధిలోకి 42 పాఠశాలలు
సైబర్ నేరాలపై తొలి స్పందనకు 261 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

విద్యార్థులను ఆన్‌లైన్ ముప్పుల నుంచి రక్షించేందుకు భారత వాయుసేన పాఠశాలల్లో ప్రత్యేక డిజిటల్ భద్రతా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వాయుసేన ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ, ఇన్ఫర్మేషన్ షేరింగ్ అండ్ అనాలిసిస్ సెంటర్ ఫౌండేషన్ (ఐసాక్) సహకారంతో 'స్ర్కోల్‌కంట్రోల్' కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 42 వాయుసేన పాఠశాలలను ఈ కార్యక్రమంలో భాగం చేశారు.

ఆయా పాఠశాలలకు చెందిన 261 మంది ఉపాధ్యాయులు 'సైబర్ క్రైమ్ ఇంటర్వెన్షన్ ఆఫీసర్స్'గా ధ్రువీకరణ శిక్షణ పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలను మభ్యపెట్టి దోపిడీకి గురిచేయడం, కృత్రిమ మేధ దుర్వినియోగం, గేమింగ్ సంబంధిత హానులు, ఆర్థిక మోసాల నుంచి విద్యార్థులను రక్షించే అంశాలపై వారికి శిక్షణ అందించారు. సైబర్ నేర ఘటనల్లో డిజిటల్ ఆధారాలను భద్రపరచడం, బాధితులకు ప్రాథమిక సహాయం అందిస్తూ తొలి స్పందనదారులుగా వ్యవహరించే సామర్థ్యాన్ని కల్పించారు.

తక్కువ ధరలకే వేగవంతమైన ఇంటర్నెట్, స్మార్ట్ పరికరాలు, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు విస్తృతంగా డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ప్రధానంగా పెద్దల కోసం రూపొందించిన, తగిన నియంత్రణలులేని ఆన్‌లైన్ వేదికల్లో పిల్లలు పలు ముప్పులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లోనే సైబర్ భద్రతపై అవగాహన, స్పందన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

అనుబంధ పాఠశాలలు ప్రతి నెలా 'సైబర్ జాగ్రూకతా దివస్' నిర్వహిస్తూ సైబర్ భద్రతకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను అమలు చేయాలని సీబీఎస్ఈ ఆదేశించింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా ఈ మార్గదర్శకాలను సమర్థంగా అమలు చేసేందుకు వాయుసేన పాఠశాలలకు 'స్ర్కోల్‌కంట్రోల్' తోడ్పడనుంది.

ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో సైబర్ క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులకు సైబర్ భద్రతపై శిక్షణ, ధ్రువీకరణ, తల్లిదండ్రులు, సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పిల్లల వయసుకు తగిన డిజిటల్ కంటెంట్‌ను గుర్తించేందుకు కుటుంబాలకు కంటెంట్ రేటింగ్ వేదికను అందుబాటులో ఉంచనున్నారు. నిర్దేశిత ప్రమాణాలను సాధించిన పాఠశాలలు 'సైబర్ సేఫ్ స్కూల్'గా గుర్తింపు పొందేందుకు అవకాశం ఉంటుంది.

ఉపాధ్యాయులకు శిక్షణ, ధ్రువీకరణతో పాటు నేషనల్ సెక్యూరిటీ డేటాబేస్‌లో వారి ఎంపానెల్‌మెంట్‌ను ఐసాక్ ఫౌండేషన్ అందిస్తోంది. సైబర్ న్యాయవాదులు, సైబర్ సైకాలజిస్టులు, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన వ్యవస్థ ద్వారా బాధితులకు రోజులో 24 గంటలూ సహాయం అందించే సదుపాయాన్ని కూడా ఈ కార్యక్రమంలో కల్పించారు.

గోపవరంలో వైసిపి నుంచి కూటమిలోకి చేరికలు

•మాజీ సర్పంచ్ ఉలిసి వసంతకుమారి దంపతులు కూటమిలో చేరిక

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం అక్టోబర్ 2: కైకలూరు మండలం వరహాపట్నం గ్రామంలో సోమవారం రాజకీయ పరిణామం చోటుచేసుకుంది గోపవరం గ్రామ మాజీ సర్పంచ్ వసంతకుమారి దంపతులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి ఎన్డీఏ కూటమిలో చేరారు కైకలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సమక్షంలో వారు కూటమిలో చేరగా, తెలుగు యువత నాయకులు పూల రామచంద్రరావు(రాజీ) కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు

ఐఆర్‌సీ సదస్సును తెలంగాణ ప్రగతికి, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా మలచాలి

తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని ప్రపంచానికి చాటేలా 85వ ఐఆర్‌సీ సదస్సు నిర్వహించాలి
19న ఉదయం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన ప్రారంభోత్సవం
'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ-సమ్మిట్‌గా ఐఆర్‌సీ
ప్రత్యేకంగా "తెలంగాణ పెవిలియన్" ఏర్పాటు చేయాలి.. దేశంలోని ప్రధాన నగరాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలి
హ్యామ్ రోడ్లు, టిమ్స్ ఆస్పత్రుల పనులు వేగవంతం చేయాలి.. ఈ ఏడాదిలోనే ఆల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ప్రారంభానికి సిద్ధం చేయాలి
సుమారు మూడున్నర గంటల పాటు రోడ్లు భవనాలు శాఖ,ఐఆర్సీ ఏర్పాట్ల పై సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, నవంబర్ 02 :
రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆల్వాల్ టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి,నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
ప్రజలకు మెరుగైన రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకు సంబంధించిన ప్రతి ప్రాజెక్టును అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ ప్రగతికి ప్రపంచ వేదికగా 85వ ఐఆర్‌సీ సదస్సు
ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (×=జ) గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వివరించగా, మంత్రి పలు కీలక సూచనలు చేశారు.
కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సదస్సును ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, వివిధ రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులు, అంతర్జాతీయ డెలిగేట్లు, ఇంజనీరింగ్ రంగ నిపుణులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.
తెలంగాణకు దక్కిన ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ఐఆర్‌సీని కేవలం సాంకేతిక సదస్సుకే పరిమితం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను దేశ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసే వేదికగా మలచాలని మంత్రి సూచించారు. రహదారుల అభివృద్ధి, ఆధునిక నిర్మాణ సాంకేతికత, మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని ప్రతినిధులకు వివరించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని చాటేలా ప్రత్యేక 'తెలంగాణ పెవిలియన్'
ఐఆర్‌సీ సదస్సుకు హాజరయ్యే అతిథులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసేలా హైటెక్స్ ప్రాంగణంలో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో పాటు ప్రత్యేకంగా 'తెలంగాణ పెవిలియన్' ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడుల అవకాశాలను కూడా ఈ పెవిలియన్‌లో ప్రదర్శించాలని సూచించారు.
నాలుగు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రతిరోజూ తెలంగాణ ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక కళా ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజూ కనీసం గంట పాటు తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు ఉండేలా చూడాలని, అతిథులకు రాష్ట్ర ప్రత్యేకతను గుర్తు చేసేలా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జ్ఞాపికలు అందించాలని సూచించారు. సదస్సులో జరిగే ముఖ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
అంతేకాకుండా, పర్యాటక శాఖ సమన్వయంతో సదస్సుకు వచ్చే అతిథులు తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని అతిథులకు పరిచయం చేసేలా పర్యటన కార్యక్రమాలను రూపొందించాలని ఆదేశించారు.
హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరులో విస్తృత ప్రచారం
ఐఆర్‌సీ సదస్సుపై దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ విమానాశ్రయం, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర ప్రధాన ప్రజా రవాణా కేంద్రాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు, ప్రత్యేక విజువల్ ప్రకటనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
అదేవిధంగా ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లోని విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లలోనూ ఐఆర్‌సీ సదస్సుతో పాటు తెలంగాణ అభివృద్ధిని పరిచయం చేసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించుకొని సదస్సుకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని సూచించారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ప్రీ-సమ్మిట్‌గా ఐఆర్‌సీ
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రీ-సమ్మిట్‌గా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.
ఐఆర్‌సీకి హాజరయ్యే కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను వివరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక అనుకూల వాతావరణం, రవాణా సదుపాయాలు, భవిష్యత్ ప్రాజెక్టులను వారికి పరిచయం చేయాలని తెలిపారు.
ఐఆర్‌సీకి వచ్చే ప్రతి ప్రతినిధికి తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూల పరిస్థితులపై అవగాహన కల్పించాలని, ఈ వేదిక ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణ ఆతిథ్యానికి ప్రతిబింబంగా ఏర్పాట్లు ఉండాలి
వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మంత్రులు, ఐఏఎస్ అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, రవాణా, ఆహారం, భద్రత, ఆతిథ్య ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత కార్యక్రమాలు నిర్వహించాలని, అతిథులకు రాష్ట్ర ఆతిథ్య ప్రత్యేకత తెలిసేలా ప్రతి ఏర్పాటును రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఐఆర్‌సీ సదస్సు విజయవంతం కావడం కేవలం ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టతో పాటు భవిష్యత్ పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన కీలకమైన అవకాశమని మంత్రి పేర్కొన్నారు. దేశ, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు తెలంగాణ నుంచి మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని, ఈ సదస్సు ద్వారా తెలంగాణ అభివృద్ధి, సంస్కృతి, పెట్టుబడుల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
85వ ×=జ వేదికగా రాష్ట్ర రోడ్ నెట్వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పలు కీలక ప్రకటనలు ఉంటాయని..ఇది తెలంగాణ అభివృద్ధిలో కీలక మైలు రాయిగా నిలవనుందని మంత్రి కోమటి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు
ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, స్పెషల్ సెక్రటరీ గంగాధర్, మోర్త్ (వీశీ=ుౡ) రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్లు లింగారెడ్డి (అడ్మిన్), బి.వి.రావు, వసంత్ నాయక్, ధర్మారెడ్డి, నర్సింగ్‌రావు, రాజేందర్, రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు,పలువురు పాల్గొన్నారు.

తవాంగ్ మఠానికి బుద్ధుని పవిత్ర అవశేషాలు

సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికిన సీఎం పెమా ఖండూ
తవాంగ్, బోమ్‌డిలా, నామ్‌సాయ్‌లలో భక్తులకు దర్శన అవకాశం



న్యూఢిల్లీ, ట్రినెట్ న్యూస్, నవంబర్ 02:
అరుణాచల్‌ప్రదేశ్‌లో బౌద్ధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం నుంచి తీసుకువచ్చిన శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాలకు అక్టోబర్ 31న తవాంగ్‌లో ముఖ్యమంత్రి పెమా ఖండూ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. చారిత్రక గాదెన్ నామ్‌గ్యాల్ లాట్సే తవాంగ్ మఠంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, బౌద్ధ భిక్షువులు, మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.
కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య, జాతీయ మ్యూజియం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. తవాంగ్, బోమ్‌డిలా, నామ్‌సాయ్‌లలో భక్తులు, ప్రజలు పవిత్ర అవశేషాలను దర్శించుకుని నివాళులర్పించే అవకాశం కల్పించారు.
ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన సందేశంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇది గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన సందర్భమని పేర్కొన్నారు. శతాబ్దానికి పైగా విరామం అనంతరం పవిత్ర పిప్రహ్వా అవశేషాలు స్వదేశానికి తిరిగి రావడం గర్వకారణమని తెలిపారు. ఈ ప్రదర్శన భారత బౌద్ధ వారసత్వం, బుద్ధుని విశ్వజనీన బోధనలపై అవగాహనను మరింత పెంపొందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.
టిబెటన్ బౌద్ధ సంప్రదాయంలో బుద్ధుడు దివ్యలోకం నుంచి భూమికి తిరిగి వచ్చిన సందర్భాన్ని స్మరించుకునే 'ల్హాబాబ్ దుచెన్' పర్వదినంతో ఈ ప్రదర్శన సమయం కలిసిరావడం ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.
ఈ పవిత్ర అవశేషాలు ఉత్తరప్రదేశ్‌లోని పిప్రహ్వా పురావస్తు ప్రాంతానికి చెందినవి. ప్రాచీన కపిలవస్తు, బుద్ధుని శాక్య సంప్రదాయంతో అనుబంధం కలిగిన ఈ ప్రాంతం బౌద్ధ చరిత్రలో ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. జాతీయ మ్యూజియంలో సంరక్షిస్తున్న ఈ అవశేషాలకు చారిత్రక, పురావస్తు, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది.
ప్రధాన కార్యక్రమానికి అనుబంధంగా 'అన్‌ఎర్తింగ్ ది సేక్రెడ్ పిప్రహ్వా: ది స్టోరీ ఆఫ్ ది హోలీ బుద్ధ రెలిక్స్ అండ్ దెయిర్ డిస్కవరీ' పేరిట ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. పిప్రహ్వాలో పురావస్తు అన్వేషణలు, పవిత్ర అవశేషాల ఆరాధన ప్రాధాన్యం, వాటి వారసత్వ ప్రయాణం, భారత్‌కు పునరాగమనానికి సంబంధించిన విశేషాలను ఇందులో వివరిస్తారు.
అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య, అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నవంబర్ 2న తవాంగ్‌లోని కలావాంగ్‌పో కన్వెన్షన్ హాల్‌లో 'బౌద్ధం: హిమాలయ ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో వ్యాప్తి' అంశంపై అంతర్జాతీయ సదస్సును కూడా నిర్వహించనున్నాయి.
పవిత్ర అవశేషాలను నవంబర్ 1 నుంచి 7 వరకు తవాంగ్ మఠంలో, నవంబర్ 8 నుంచి 13 వరకు బోమ్‌డిలాలోని టీజీఎల్ మఠం (లోయర్ గొంపా)లో, నవంబర్ 14 నుంచి 20 వరకు నామ్‌సాయ్‌లోని గోల్డెన్ పగోడాలో ప్రజల దర్శనార్థం ఉంచనున్నారు. నవంబర్ 21న తిరిగి న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియానికి తీసుకురానున్నారు.
బుద్ధుని శాంతి, కరుణ, అహింస, సామరస్య సందేశాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ఈశాన్య ప్రాంతంలోని సమాజాలకు భారత బౌద్ధ వారసత్వాన్ని మరింత దగ్గర చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ సమాజాలతో భారతదేశ చారిత్రక, ఆధ్యాత్మిక సంబంధాలను బలోపేతం చేసేందుకు ఈ ప్రదర్శన దోహదపడనుంది.

గ్రామీణ ఉపాధి ఫిర్యాదులకు 15 రోజుల్లో పరిష్కారం

వీబీ--జీ రామ్ జీ కింద ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు--2026 జారీ
ఏడు పనిదినాల్లో విచారణ.. గడువు దాటితే పైస్థాయికి ఫిర్యాదు
గ్రామ పంచాయతీ, బ్లాక్, జిల్లా స్థాయుల్లో ప్రత్యేక వ్యవస్థ

న్యూఢిల్లీ, ట్రినెట్ న్యూస్, నవంబర్ 02:
గ్రామీణ ఉపాధి, జీవనోపాధి పథకం అమలుకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. 'వికసిత్ భారత్--గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ--జీ రామ్ జీ) చట్టం కింద ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు--2026ను తీసుకువచ్చింది. ఫిర్యాదు అందిన తేదీ నుంచి ఏడు పనిదినాల్లో విచారణ పూర్తి చేసి, 15 రోజుల్లో పరిష్కరించాలని నిబంధనల్లో స్పష్టం చేసింది.
రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ, బ్లాక్, జిల్లా స్థాయుల్లో బహుళ అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయా స్థాయుల్లో నియమితులైన ఫిర్యాదుల పరిష్కార అధికారులు ఫిర్యాదులను స్వీకరించడం, నమోదు చేయడం, విచారించడం, పరిష్కరించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా కార్యక్రమ సమన్వయకర్త ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు.
పథకం అమలుతో సంబంధం ఉన్న ఏ అంశంపైనైనా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. సంబంధిత అధికారికి స్వయంగా అందించడం, డెలివరీ రుజువుతో కూడిన స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపడం, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన డిజిటల్ వేదికలో నమోదు చేయడం వంటి మార్గాలను అందుబాటులోకి తెచ్చారు. టెలిఫోన్, ప్రత్యేక హెల్ప్‌లైన్లు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే ఇతర విధానాల్లోనూ ఫిర్యాదులు స్వీకరించనున్నారు.
గ్రామ పంచాయతీ, బ్లాక్ లేదా జిల్లా స్థాయిలో భౌతిక రూపంలో అందిన ఫిర్యాదులను అదే రోజు డిజిటల్ వేదికలో నమోదు చేయాలి. సాధ్యం కాని సందర్భాల్లో తదుపరి పనిదినంలోగా నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం ఫిర్యాదు నమోదు సంఖ్య, అందిన తేదీ, స్వీకరించిన అధికారి హోదాతో కూడిన రసీదును ఫిర్యాదుదారుకు అందించాలి. డిజిటల్ ఫిర్యాదులకు ఎలక్ట్రానిక్ రూపంలో, భౌతికంగా అందిన వాటికి భౌతిక రూపంలో రసీదు ఇవ్వాలి.
ఫిర్యాదు నమూనా, భాష, సమర్పించిన విధానం లేదా ప్రక్రియాపరమైన లోపాలను కారణంగా చూపుతూ నమోదు నిరాకరించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. విధానపరమైన అడ్డంకులు లేకుండా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ నిబంధన అవకాశం కల్పిస్తోంది.
నమోదైన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి అవసరమైన విచారణ చేపట్టాలి. ఇందుకోసం సంబంధిత రికార్డులు, రిజిస్టర్లు, పత్రాలు, నివేదికలు, ఎలక్ట్రానిక్ సమాచారం కోరవచ్చు. అవసరమైన సందర్భాల్లో ఫిర్యాదుదారు స్వయంగా లేదా ఎలక్ట్రానిక్ విధానంలో తన వాదన వినిపించేందుకు తగిన అవకాశం ఇవ్వాలి.
విచారణ పూర్తయిన తర్వాత నిర్ధారించిన అంశాలను నమోదు చేసి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా దిద్దుబాటు లేదా పరిహార చర్యలు చేపట్టాలి. విచారణ ఫలితాలు, తీసుకున్న చర్యలను డిజిటల్ వేదికలో నమోదు చేయడంతో పాటు ఫిర్యాదుదారుకు తెలియజేయాలి. భౌతిక రూపంలో అందిన ఫిర్యాదుల పరిష్కార వివరాలను భౌతిక రూపంలోనూ అందించాలి.
ఫిర్యాదు నమోదు నుంచి తుది పరిష్కారం వరకు ప్రతి దశను డిజిటల్ వేదిక ద్వారా తెలుసుకునే సదుపాయం కల్పించనున్నారు. నిర్దేశిత 15 రోజుల గడువులో పరిష్కారం కాని ఫిర్యాదులను రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా తదుపరి ఉన్నతస్థాయికి పంపిస్తారు. అవి పరిష్కారమయ్యే వరకు ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ కొనసాగుతుంది. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించారు. వీబీ--జీ రామ్ జీ చట్టం--2025లోని షెడ్యూల్--1 ప్రకారం అప్పీళ్ల దాఖలు, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుంది.
ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే, జవాబుదారీతనంతో కూడిన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను స్థిరపరచడమే ఈ నిబంధనల లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. పథకం అమలులో స్పందనను మెరుగుపరచడంతో పాటు గ్రామీణ కుటుంబాల హక్కులు, ప్రయోజనాలను బలోపేతం చేసేందుకు ఇవి దోహదపడనున్నాయని పేర్కొంది.

క్లీన్ , ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ ఉండాలి


చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు
అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లు
ట్రాఫిక్ క్రమబద్ధీకరపై ప్రత్యేక దృష్టి పెట్టండి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, నవంబర్ 02 :



హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్ఫ్రస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్ ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారుకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా అభ్యర్థులను గెలిపించండి: మాజీ హోం మంత్రి తానేటి వనిత పిలుపు



స్థానిక ఎన్నికల పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ ఇన్‌చార్జ్, మాజీ హోం మంత్రి తానేటి వనిత కోరారు. ద్వారకాతిరుమల మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన ప్రచారంలో ఆమె విస్తృతంగా పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు.ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన అనంతరం, శ్రీ వెంకటేశ్వర స్వామివారి పాదుకా మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ గ్రామంలో కోలాహలంగా సాగింది. అనంతరం నేతలు గ్రామ వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో పేదలకు అండగా నిలిచారని, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని గుర్తుచేశారు. పాలనను నేరుగా ప్రజల ముంగిట్లోకి తెచ్చిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ జగనన్న గొప్ప ఆలోచన అని కొనియాడారు. తిరిగి సంక్షేమ పాలన కొనసాగాలంటే ఈ స్థానిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు.మండల జడ్పీటీసీ అభ్యర్థి బుసనబోయిన విజయలక్ష్మి, ఎంపీటీసీ-1 అభ్యర్థి ఉక్కుర్తి వెంకట్రావు, ఎంపీటీసీ-2 అభ్యర్థి పొంగులేటి రమేష్‌లను భారీ మెజారిటీతో విజయం వైపు నడిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్న బాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బుసనబోయిన వంశీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, ఇమ్మడి నాగేశ్వరరావు, ఇమ్మడి పవన్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ములకాల పానకాలు, రుద్ర వెంకట శివాజి, బొండాడ సాత్యకి రావు, పొనమాల ఉమామహేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, చిలుకూరి చంద్రశేఖర రావు, బొంతు శ్రీనివాస్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణ మార్కెట్లలో ఏఐ విప్లవానికి శ్రీకారం.. దేశానికే ఆదర్శంగా డిజిటల్ మార్కెట్ యార్డుల ఏర్పాటుకు మంత్రి ఆదేశాలు

-- రైతు మార్కెట్ యార్డులో అడుగుపెట్టినప్పటి నుంచి పంట విక్రయం వరకు అంతా డిజిటల్ చేసేలా కొత్త వ్యవస్థ
--మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఏఐ టెక్నాలజీకి ప్రాధాన్యం
-- రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారంలో పూర్తి పారదర్శకతే లక్ష్యం
--దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత మార్కెట్ యార్డుల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు
-- వారం రోజుల్లో టెండర్లు పిలవాలని మంత్రి సూచన
-- కోహెడ పండ్ల మార్కెట్‌పై మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి
-- కోహెడ మార్కెట్ నిర్మాణంలో వేగం పెంచండి.. మార్చి నాటికి తొలి దశ పూర్తి చేయండి
--వారం రోజుల్లో టెండర్లు పిలవాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02 :

దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ మార్కెట్ యార్డ్ వ్యవస్థను తెలంగాణలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతు పండించిన పంటకు సరైన ధర లభించడంతో పాటు, మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.
సోమవారం
సచివాలయంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతు మార్కెట్ యార్డులోకి ప్రవేశించినప్పటి నుంచి పంట విక్రయించి, చెల్లింపులు పొంది, మార్కెట్ నుంచి బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రైతు వివరాల నమోదు, ప్రతి పంట లాట్‌కు ప్రత్యేక ఐడీ కేటాయింపు, డిజిటల్ బిడ్డింగ్ లేదా టెండర్ నమోదు, పంట నాణ్యత పరీక్ష (అసేయింగ్), ఆన్‌లైన్ వేలం, ధర నిర్ణయం, రైతు అంగీకారం, పంట తూకం, అమ్మకపు బిల్లుల తయారీ, మార్కెట్ ఛార్జీల లెక్కింపు, రైతులకు చెల్లింపులు, గేట్ ఎగ్జిట్ నమోదు, ఈ-రసీదులు, ఈ-పర్మిట్ల జారీ వరకు అన్ని ప్రక్రియలు ఒకే వేదికపై నిర్వహించేలా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. ఈ విధానంలో రైతు మార్కెట్ యార్డుకు రాగానే అతని వివరాలు నమోదు చేసి, పంటకు ప్రత్యేకమైన లాట్ ఐడీ కేటాయిస్తారు. అనంతరం పంట నాణ్యతను పరీక్షించి సంబంధిత వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారు. వ్యాపారులు ఆన్‌లైన్‌లో లాట్ వివరాలను పరిశీలించి తమ బిడ్లను నమోదు చేస్తారు. వేలం లేదా టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నిర్ణయించిన ధరను వ్యవస్థలో ప్రకటిస్తారు. కమిషన్ ఏజెంట్ ద్వారా రైతుకు ఓటీపీ పంపించి, రైతు ధరను నిర్ధారించిన తర్వాత తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది. పంట తూకం వేసి, నమోదైన బరువు, ఖరారైన ధర ఆధారంగా కమిషన్ ఏజెంట్ లేదా మార్కెట్ కమిటీ అమ్మకపు బిల్లును రూపొందిస్తుంది. మార్కెట్ ఛార్జీలు, రైతుకు చేసిన చెల్లింపుల వివరాలు నమోదు చేసి, అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం గేట్ ఎగ్జిట్ ద్వారా ఈ-రసీదులు, ఈ-పర్మిట్లు జారీ చేస్తారు.
మార్కెట్ యార్డుకు వచ్చిన పంట వివరాలు, ధరల ధోరణులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల కార్యకలాపాలు, వేలం వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) రూపొందించాలని మంత్రి సూచించారు. గతంలో జరిగిన వేలం, లావాదేవీల వివరాలను భద్రపరిచి, అవసరమైనప్పుడు విశ్లేషణలు, తనిఖీల కోసం తిరిగి పొందేలా చూడాలన్నారు. వివిధ దశల్లో నమోదయ్యే సమాచారం స్వయంచాలకంగా అనుసంధానమయ్యేలా సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న డిజిటల్ మార్కెట్ వ్యవస్థలను అధ్యయనం చేసి, వాటికంటే మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణలో ఆదర్శవంతమైన వ్యవస్థను తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారుల హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను కూడా ఈ డిజిటల్ వ్యవస్థలో భాగంగా చేయాలని సూచించారు. ఐటీ శాఖతో సమన్వయం చేసుకొని, వారం రోజుల్లోగా టెండర్లు పిలిచే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వ్యవస్థతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, గోదాముల నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లలో పంటలకు లభిస్తున్న ధరలను ప్రదర్శించాలన్నారు. అధికంగా వ్యాపార లావాదేవీలు జరిగే మార్కెట్ యార్డుల్లో తొలుత ఈ సదుపాయాలను ఏర్పాటు చేసి, క్రమంగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్లకు విస్తరించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకొని మాన్యువల్ జోక్యానికి అవకాశం లేకుండా, ప్రతి లావాదేవీకి జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.
కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలి
కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
సచివాలయంలో కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రతినిధులు సూచించిన భూమి చదును సవరణలపై ముఖ్యమంత్రి ఆమోదం తీసుకొని, వచ్చే వారం రోజుల్లోగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే మార్చి నాటికి మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసి, మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సదుపాయాలతో కూడిన సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టి, పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ మరియు మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ కరదీపిక

చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో విక్రమ్స్ అకాడమీ పుస్తకావిష్కరణ



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలని చిక్కడపల్లి ఎస్సై కరీం సూచించారు. చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో సోమవారం విక్రమ్స్ అకాడమీ రూపొందించిన 'జనవరి--సెప్టెంబర్ 2026 తొమ్మిది నెలల కరెంట్ అఫైర్స్' పుస్తకాన్ని రచయిత విక్రమ్, నిరుద్యోగ జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎస్సై కరీం మాట్లాడుతూ రాబోయే పోటీ పరీక్షలకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ జేఏసీ నేత శంకర్ నాయక్ మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్ అంశాలను సమగ్రంగా, విశ్లేషణాత్మకంగా అందించిన రచయిత విక్రమ్‌ను అభినందించారు.
నిరుద్యోగ జేఏసీ నేత, ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పరికరాల నరేష్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. తొమ్మిది నెలల ముఖ్యాంశాలను ఒకే పుస్తకంగా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.
పుస్తక రచయిత, విక్రమ్స్ అకాడమీ డైరెక్టర్ విక్రమ్ మాట్లాడుతూ పోటీ పరీక్షల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తగిన జాగ్రత్తలతో పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఇది చక్కని కరదీపికగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో పోటీ పరీక్షల అభ్యర్థులతో పాటు నిరుద్యోగ జేఏసీ నాయకులు రవి యాదవ్, కుమార్ రాథోడ్, గణేష్, వేణు, అనిల్ కుమార్ గౌడ్, రజియా బేగం, వెంకటేష్, నాగరాజు, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడానికే అమిత్ షా హైదరాబాద్ పర్యటన పరిమితం: మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణ విభజన హామీలపై ఎందుకు మాట్లాడలేదు? కేంద్రం నుంచి రాష్ట్రానికి అందుతున్న నిధులపై చర్చకు సిద్ధమా?



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02 :

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన కేవలం కాంగ్రెస్ పార్టీని విమర్శించడానికే పరిమితమైందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, విభజన హామీలు, రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన నిధులు, ప్రజా సమస్యలపై అమిత్ షా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణపై విమర్శలు చేసే ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన బాధ్యతలను గుర్తించుకోవాలని హితవు పలికారు. అమిత్ షా పర్యటన సందర్భంగా తెలంగాణ విభజన హామీలు, రాష్ట్ర ఏర్పాటు సమయంలో బీజేపీ చేసిన విమర్శలపై స్పందిస్తారని ఆశించామని, కానీ ఆయన పర్యటన కాంగ్రెస్‌పై ఆరోపణలకే పరిమితమైందని పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తూ, రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ నేతలు చెబుతున్నారని మండిపడ్డారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించడాన్ని కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకిస్తుందని పొన్నం స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రిగా అమిత్ షా ఉన్నప్పటికీ చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించే పరిస్థితి ఎలా ఏర్పడిందో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.
ఎస్ఐఆర్ ప్రక్రియలో విదేశీయుల ఓట్లు తొలగించామని చెబుతున్నారని, అలా తొలగించిన విదేశీయుల్లో ఎంతమందిని వారి దేశాలకు తిరిగి పంపించారో ఆధారాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చ జరగాలని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ అర్హతలేని ఓట్ల తొలగింపును వ్యతిరేకించడం లేదని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్ల ఓట్లను తొలగించడంపైనే ప్రశ్నిస్తోందని వివరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పదిసార్లు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టిందని గుర్తుచేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యాలయాల నుంచి ఓట్ల తొలగింపు ఫారాలు పంపిణీ అవుతున్నాయన్న ఆరోపణలపై అమిత్ షా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

ఆరు గ్యారంటీలతో ప్రజలకు సంక్షేమం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగ నియామకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.
కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అమిత్ షాకు సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్నారని బీజేపీ ఆరోపించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అదే తరహా విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

మోదీ, అమిత్ షా పాలనపై విమర్శలు

దేశంలో మోదీ, అమిత్ షా పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని మంత్రి ఆరోపించారు. దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి కొద్దిమంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని, అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
మణిపూర్‌లో హింస, అరుణాచల్ ప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడకుండా గల్లీ రాజకీయాలకు పరిమితమవుతున్నారని మండిపడ్డారు. అమిత్ షా దేశానికి హోంమంత్రా? లేక గల్లీ మంత్రా? అని ఘాటుగా ప్రశ్నించారు.

బీజేపీ హామీలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు, కేంద్రంలో ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులకు నెలవారీ పింఛన్లు ఇస్తామని చెప్పి అమలు చేశారా? ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన హామీ ఏమైంది? ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారు? ధరలు 30 శాతం తగ్గిస్తామని, లీటర్ పెట్రోల్ రూ.50కే అందిస్తామని చేసిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని చరిత్ర బీజేపీదేనని, ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేని అసమర్థత కేంద్ర ప్రభుత్వానిదని విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి ఎంత పన్ను వెళ్తోంది? తిరిగి రాష్ట్రానికి ఎంత నిధులు ఇస్తున్నారు? అనే అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

తెలంగాణ కరువుపై కేంద్రం సాయం చేయాలి

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని పొన్నం ప్రభాకర్ కోరారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ విమర్శలకే అమిత్ షా ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు.
ఢిల్లీలో జరిగిన ర్యాలీకి కౌంటర్ ఇచ్చేందుకు అక్కడికి వెళ్లే ధైర్యం లేక హైదరాబాద్ వచ్చారని విమర్శించారు. అమిత్ షా పర్యటన స్థానిక బీజేపీ నాయకత్వం రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే సాగిందని, పర్యటన ఎంత విఫలమైందో ఆయనకే తెలుసని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రధానమంత్రి నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమిత్ షా కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకుంటే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను విమర్శించడం వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఉండదని, 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనే ప్రస్తుత పరిస్థితులకు కారణమని ఆరోపించారు.
గతంలో స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని, ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలని, అరాచకత్వం అంతం కావాలని కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

అమిత్ షా మెగా పాదయాత్రకు గాంధీనగర్ నుంచి భారీగా తరలిన బీజేపీ శ్రేణులు

మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో 500 మంది హాజరు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న మెగా పాదయాత్రకు గాంధీనగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న అవినీతి ఆరోపణలు, అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు ఈ పాదయాత్ర నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్ శ్రీకాంత్, వీఎస్‌టీ రాజు, ఎం.ఉమేష్, మహమూద్, ఆసంద్ రావు, నర్సింహ, సాయి కుమార్, సత్యేందర్, చర్ర యాదగిరి, రహమత్ అలీ, హన్మంతు, విజయలక్ష్మి, సంధ్యారాణి, సంయుక్తరాణి, సంతోష్, రాజ్‌కుమార్, సాయి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

యాదాద్రి భువనగిరి, నవంబరు02/ట్రైనెట్ న్యూస్:



యాదాద్రి భువనగిరి జిల్లా సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 158 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.అందులో రెవిన్యూ శాఖ 102, హౌసింగ్ 12,ఉపాధి కల్పన 7, ఎస్సీ కార్పొరేషన్ 5, గ్రామీణ అభివృద్ధి శాఖ 4,సర్వే ల్యాండ్స్ 4, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, మండల పరిషత్ 3, విద్య 2, వైద్య ఆరోగ్య 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2, మైన్స్, విద్యుత్, సివిల్ సప్లై, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఈ.డి. ఎం , వ్యవసాయ, సంక్షేమ , ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణా రెడ్డి ,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగి రెడ్డి,డిప్యూటీ కలెక్టర్ సాత్విక్,జెడ్పీ సీఈఓ శోభా రాణి, డి.పి.ఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా తెలంగాణ మహిళా కమిషన్ చేస్తున్న కృషికి జాతీయ మహిళా కమిషన్ ప్రశంసలు..

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

మహిళల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమం, సమానత్వం, సాధికారతే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ అభినందించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్ నేరెళ్ల శారద న్యూఢిల్లీలోని జాతీయ మహిళా కమిషన్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలు, మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యాచరణ, మహిళల హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, కమిషన్ సాధించిన ప్రగతి, వివిధ సామాజిక సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు అందజేశారు.

ఈ పుస్తకంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, మహిళలకు న్యాయం అందించేందుకు నిర్వహిస్తున్న విచారణలు, బాధిత మహిళలకు అండగా నిలుస్తున్న విధానాలు, మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాలు, మహిళల భద్రత, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన, గ్రామీణ ప్రాంత మహిళల అభ్యున్నతికి చేపడుతున్న చర్యలను వివరించారు. తెలంగాణ మహిళా కమిషన్ రూపొందించిన కార్యక్రమాల సమగ్ర నివేదికను, పుస్తక రూపంలో వాటిని పొందుపరిచిన విధానాన్ని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్రస్థాయిలో మహిళల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న కృషి పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాలు మరింత విస్తృత స్థాయిలో కొనసాగాలని ఆకాంక్షించారు.

మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింస, గృహహింస తదితర సమస్యలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు, పలు అంశాలు చర్చకు వచ్చాయి

మహిళలకు న్యాయం:



- బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంపొందించడం.

చట్టాలపై అవగాహన:

- మహిళలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టపరమైన రక్షణలు, న్యాయ సహాయంపై విస్తృత అవగాహన కల్పించడం.

సైబర్ నేరాల నివారణ:

- మహిళలు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలపై అవగాహన పెంచి రక్షణ చర్యలను బలోపేతం చేయడం.

గ్రామీణ మహిళల సాధికారత:

- గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హక్కులు, అవకాశాలపై అవగాహన కల్పించడం.

ఆర్థిక స్వావలంబన:

- మహిళలకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, పారిశ్రామిక అవకాశాలను ప్రోత్సహించడం.

జాతీయ స్థాయి సమన్వయం:

- జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్లు, ప్రభుత్వ శాఖల మధ్య పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం.

మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యం..

- నేరెళ్ల శారద

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మాట్లాడుతూ, మహిళలకు కేవలం సంక్షేమ పథకాలు అందించడం మాత్రమే కాకుండా, వారికి సమాజంలో సముచిత గౌరవం, సమాన అవకాశాలు, భద్రత, న్యాయం, ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

తెలంగాణలోని ప్రతి మహిళకు న్యాయం అందేలా, మహిళల సమస్యల పరిష్కారానికి కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు, పేద, బలహీన వర్గాల మహిళలు, గ్రామీణ మహిళల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

జాతీయ మహిళా కమిషన్‌తో సమన్వయం చేసుకుంటూ మహిళల రక్షణ, హక్కులు, సాధికారత కోసం మరిన్ని సమర్థవంతమైన కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో లభించిన ఈ ప్రశంస మహిళా సాధికారత దిశగా మరింత బాధ్యతతో, అంకితభావంతో పనిచేయడానికి స్ఫూర్తినిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వం, సాధికారతతో కూడిన సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తన కార్యాచరణను మరింత బలోపేతం చేయనుంది.

స్వచ్ఛత, పెండింగ్ పనుల పరిష్కారంపై సాంస్కృతిక శాఖ ప్రత్యేక దృష్టి

ముగిసిన స్పెషల్ క్యాంపెయిన్ 6.0

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

కార్యాలయాల్లో స్వచ్ఛతను వ్యవస్థాగత అలవాటుగా మార్చడం, పెండింగ్ వ్యవహారాలను తగ్గించడం లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ క్యాంపెయిన్ 6.0ను కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పూర్తి చేసింది. అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రిత్వ శాఖతోపాటు అనుబంధ, అధీన, స్వయంప్రతిపత్తి సంస్థలు ప్రణాళికాబద్ధంగా పాల్గొన్నాయి.

కార్యక్రమంలో భాగంగా కార్యాలయాల్లో విస్తృత పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు పనికిరాని సామగ్రిని తొలగించి స్థల వినియోగాన్ని మెరుగుపరిచారు. భౌతిక, ఎలక్ట్రానిక్ ఫైళ్లను సమీక్షించి, నిబంధనల ప్రకారం అవసరం లేని రికార్డుల తొలగింపుపై దృష్టి సారించారు.

ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న పార్లమెంటరీ హామీలు, ప్రముఖుల నుంచి వచ్చిన వినతులు, అంతర్ మంత్రిత్వ శాఖల సంప్రదింపులకు సంబంధించిన వ్యవహారాల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు.

కీలక విభాగాల్లో ఈ కార్యక్రమం గణనీయమైన ఫలితాలను సాధించిందని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. పరిశుభ్రమైన, సమర్థవంతమైన, పౌర కేంద్రిత కార్యాలయాలను తీర్చిదిద్దడం ద్వారా సుపరిపాలనను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొంది.

డి రేపాక ఫీల్డ్ అసిస్టెంట్ సూరారం సుధీర్ ఆకస్మికంగా మృతి



యాదాద్రి భువనగిరి, నవంబరు02/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం డి రేపాక గ్రామ వీబి-జీ రామ్ జీ ఫీల్డ్ అసిస్టెంట్ సూరారం సుధీర్ ఆకస్మికంగా మృతిచెందారు. వారు గత 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు లేవని అన్నారు. వారి కుటుంబంలో ఉద్యోగం ఇచ్చి10లక్షల ఎక్స్ గ్రేషియా అందచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంకల సిద్ధిరాజు, జిల్లా అధ్యక్షులు బబ్బురి శంకర్, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు అంత్యక్రియలు కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

ఖేలో ఇండియా పోటీలకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చెయ్యాలి : సీఎం రేవంత్ రెడ్డి

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేలో ఇండియా 2026 పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 8వ ఎడిషన్ క్రీడల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ లోసోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీలకు ఎక్కడా ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘ కాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలు ఒక గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేలో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లు చెయ్యాలని



సీఎం సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో క్రీడలు, క్రీడాభివృద్ధికి సంబంధించిన పెట్టుబడుల ఆకర్షణ కూడా ఒక భాగం అయినందున అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది ఖేలో ఇండియా పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలన్నారు. ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకునే విధంగా గ్రూప్-1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించాలన్నారు. వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయా చోట్ల స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్-1 అధికారులను నియమించాలన్నారు.

క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపై సమాచారమివ్వాలన్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా పోటీల్లో జరిగిన పరిణామాలు నివృత్తి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కొన్ని చోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు క్రీడా పోటీలు ముగిసిన కొన్నేళ్ళలోనే విచ్చిన్నం అయ్యాయని గుర్తు చేశారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసరమైన ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులతో పాటు సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ సహా 6 నగరాల్లో 20 చోట్ల 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ కర్రసాము క్రీడను కూడా ఆతిథ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో ఖేలో ఇండియా శిబిరాల్లో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. వివిధ క్రీడల పోటీల నిర్వహణ కోసం 20 వేదికల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణ రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేయాలని కోరిన మెగాస్టార్ చిరంజీవి



కళాకారులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన, మార్ఫింగ్ చేసిన వీడియోలను రూపొందించడంపై ఇటీవల ఎక్స్ వేదికగా తన ఆందోళనను వ్యక్తం చేసిన మెగాస్టార్ చిరంజీవి.. ఈ అంశంపై మరో కీలక అడుగు వేశారు. ఈ రోజు హైదరాబాద్‌లో గౌరవ కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారిని కలిసి, ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్ సమస్యలను వివరించారు. ఈ భేటీలో చిరంజీవి గారితో పాటు రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీలను దుర్వినియోగం చేస్తున్న తీరును స్వయంగా వివరించేందుకు చిరంజీవి ఈ భేటీకి అపాయింట్‌మెంట్ కోరారు. ఈ సాంకేతికతల దుర్వినియోగం కళాకారుల హక్కులు, గౌరవం, క్రియేటివ్ కంటెంట్‌కు ముప్పుగా మారుతోందని ఆయన వివరించారు. ఈ సమస్యను కేవలం సోషల్ మీడియా వేదికకే పరిమితం చేయకుండా, చిత్ర పరిశ్రమ తరఫున ఇటువంటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేయాలని కోరారు.

చిరంజీవి ఆందోళనలను సానుకూలంగా అర్థం చేసుకున్న కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారు.. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలిస్తుందని, మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేసే దిశగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించాలని సూచించిన ఆయన, ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసే బాధ్యతను శ్రీ జి. కిషన్ రెడ్డి గారికి అప్పగించారు.

కేంద్ర హోంమంత్రి స్పందనకు కృతజ్ఞతలు తెలిపిన చిరంజీవి.. ఆయన ఇచ్చిన హామీ చిత్ర పరిశ్రమకు ప్రోత్సాహాన్నిచ్చే కీలక అడుగుగా అభివర్ణించారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించి, కళాకారులకు తగిన రక్షణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..

•దీపావళి సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల ఏర్పాటు జరగకుండా చర్యలు తీసుకోవాలి..

•జిల్లా కలెక్టర్‌కు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకుల వినతి..

దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లాలో టోకు (హోల్ సేల్)బాణసంచా దుకాణాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు బెజ్జంకి సతీష్ కోరారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించి పేలుడు పదార్థాల నిబంధనలు -- 2008 ప్రకారం సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు, విక్రయ అనుమతి పత్రాలు పొందడం తప్పనిసరి అని పేర్కొన్నారు. పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు, అనుమతులకు సంబంధించిన నిబంధనలను వ్యాపారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

జిల్లాలో దీపావళి సందర్భంగా హోల్సేల్ వ్యాపారస్తులు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను సంబంధిత అధికారులు ముందస్తుగా పరిశీలించాలని కోరారు.



ముఖ్యంగా పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాలు, భద్రతా ఏర్పాట్లు, అనుమతులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అయితే హోల్సేల్ వ్యాపారస్తులకు ప్రస్తుతం అగ్నిమాపక శాఖ అనుమతులను ఇవ్వవలసిన అవసరం లేదని దానిని ఎక్స్ప్లోసివ్ అండ్ పెట్రోలియం ఆర్గనైజేషన్ సంస్థ ఇవ్వడం జరుగుతుంది.. అందువలన ప్రమాదవశాత్తు అనుకోని సంఘటనలు జరిగితే తీవ్ర ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టం జరిగే ఆస్కారం ఉంది.. కావున హోల్సేల్ వ్యాపారస్తులు తప్పనిసరిగా అగ్ని మాపక శాఖ యొక్క అనుమతులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా వ్యాపారాల నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.. తమరికి విజ్ఞప్తి చేయడమైనది.

అంతేకాకుండా రిటైలర్లు విక్రయించే బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేని విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులను కోరారు.

దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకునేలా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు బెజ్జంకి సతీష్ విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే అభివృద్ధి చూసి తెదేపాలో చేరిక

గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నక్కా శ్రీను, కొత్తపల్లి అనీల్ సోమవారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు.రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, మండల తెదేపా అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, మండల యువ నాయకుడు మొగతడకల ఓం ప్రకాష్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం లంకా సత్యనారాయణ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, అందుకే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తెదేపాలోకి వస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ ఘంటా శ్రీనివాసరావు, గ్రామ తెదేపా నాయకుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టమంతా రైతులది...! లాభమంతా వ్యాపారులుదా....?

- ధాన్యం ధరల పతనం రైతన్నకు కంటతడి...?
- పత్రికా ప్రకటనలకు పరిమితమైన మండల వ్యవసాయ శాఖ...?
- పెట్టుబడి పెరిగినా.. దిగుబడికి గిట్టుబాటు ధర కరువు...!
- 75 కేజీల బస్తా ధర2,400 నుంచి1,800కు పతనం.. తరుగుల పేరుతో మరో కోత....!





ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు పెరిగిన సాగు ఖర్చులు.. ఇంకోవైపు వ్యాపారుల ధరల దోపిడీ.. వెరసి పినపాక మండలంలోని వరి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కష్టపడి పంట పండించినా ఆశించిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పులే మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎండల ప్రభావంతో వరి పంటకు నీటి కొరత ఏర్పడింది. రైతులు తమ చెమటను నీరుగా మార్చి, వాగులు, వంకల్లో అందుబాటులో ఉన్న నీటిని ఇంజన్లు, మోటార్ల సహాయంతో తోడి పొలాలకు అందించారు. పంట ఎండిపోకుండా నానా కష్టాలు పడి సాగును కొనసాగించారు. గతంలో ఎకరా వరి సాగుకు సుమారు రూ. 25 వేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం పెరిగిన కూలీ, ఎరువులు, పురుగుమందులు, నీటి తడుల ఖర్చులతో పెట్టుబడి రూ. 40 వేల వరకు చేరిందని రైతులు చెబుతున్నారు.

- కోతల ప్రారంభంలో ఒక ధర.. చివర్లో " సిండికేట్ "ధర....!

వరి కోతలు ప్రారంభమైన సమయంలో 75 కేజీల పచ్చి ధాన్యం బస్తాకు రూ.2,400 వరకు ధర పలికింది. ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు వేరే మండలాలలో 4000 రూపాయలు వరకు ధాన్యానికి కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. కానీ పినపాక మండలంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది వ్యాపారులు సిండికేట్ గా మారి ధరలను పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో బస్తా ధర రూ. 1,800కు పడిపోయింది. కొద్దిరోజుల వ్యవధిలోనే రూ. 600 తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ధరలు తగ్గిస్తున్నారని మండలంలోని రైతన్నలు ఆరోపిస్తున్నారు.

- పచ్చి ధాన్యం అమ్మకానికే మొగ్గు చూపుతున్న రైతన్న...!

ధాన్యాన్ని కోసిన తర్వాత ఆరబెట్టేందుకు అనుకూల వాతావరణం లేకపోవడం, తుఫాన్ల ప్రభావం, కూలీల కొరత తదితర కారణాలతో రైతులు పచ్చి ధాన్యాన్ని విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.గతంలో వరి కోసి కుప్పలుగా వేసి, పరదాలు పరిచి, ధాన్యాన్ని వేరు చేసి తూకం చేసేవారు. ఆ సమయంలో ధాన్యంలో మట్టి, ఇసుక రేణువులు ఉంటాయనే కారణంతో కొంత తరుగు తీసేవారు. ప్రస్తుతం యంత్రాలతో కోతలు కోసి నేరుగా ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించి బస్తాల్లో నింపి తూకం వేస్తున్నారు. అయినప్పటికీ ఖాళీ బస్తా బరువును మినహాయించాల్సింది పోయి, అదనంగా రెండు కేజీల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రతి బస్తాపై రైతులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అధికారులు స్పందించి రైతన్నకు న్యాయం చేయాలి...!

ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు చివరకు అప్పులే మిగులుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పినపాక మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధర కంటే తక్కువకు ఎవరు ధాన్యం కొనుగోలు చేసినా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. పెట్టుబడిదారుల కబంధహస్తాల్లో చిక్కుకున్న రైతన్న.... అధికారులకు ఎలా ఫిర్యాదు చేస్తారో .... అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి . పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధాన్యం ధరలు లేకపోవడం, వ్యాపారుల ధరల నియంత్రణ, తరుగుల పేరుతో కోతలు, ఎరువుల అధిక ధరలతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, తరుగుల దోపిడీని అరికట్టి, ఎరువులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని పినపాక మండల రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

బోటిగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు.



పినపాక మండల పరిధిలోని బోటిగూడెం గ్రామపంచాయతీ కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బాపనమ్మ, ఉపసర్పంచ్ ధనలక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని వేలం వేయకుండా ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కూకట్ పల్లి గ్రామం పరిధిలోని సర్వేనెంబర్ 121 నుండి 157 వరకు ఉన్న 33 ఎకరాలు ఉన్న భూమిలోని మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ట్రక్ పార్కును వేలం వేయకుండా ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, ప్లే గ్రౌండ్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బి.ఆర్.ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత ప్రభుత్వంలో భూములను కాపాడుతూ వస్తుంటే రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత అన్ని అమ్మ కాలే జరుగుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధి కొరకు గతంలో గ్రామ పరిధిలోని పట్టా భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందజేస్తే ఇప్పుడు అమ్మకాలు చేసి ఇక్కడ ఉండే 60 బస్తీలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వేలంవేసే విషయంలో పునరాలోచించి ప్రజా అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

అర్హులైన ముస్లిం పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- **మైనారిటీ యువత ఓటర్ నమోదు పై దృష్టి సారించాలి**
- **కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎస్కే జానీ పాషా పిలుపు**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ముస్లిం యువతీ యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా మైనారిటీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఎస్కే జానీ పాషా పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జానీ పాషా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని ప్రతిబింబించేందుకు ఓటరు నమోదే తొలి అడుగు అని పేర్కొన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనారిటీ యువతీ, యువకులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకొని, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చొరవ చూపాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ప్రజాస్వామ్య బలోపేతంలో పట్టభద్రుల పాత్ర కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఎస్కే జానీ పాషా విజ్ఞప్తి

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి,

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ కు చెందిన లింగంపల్లి లక్ష్మి తాను, తన భర్త వృద్ధులమని, తను దివ్యాంగురాలు అని, తన భర్త కూలీగా పనిచేసి పోషిస్తున్నాడని, రెండు పడక గదుల ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన శివలి జగదీష్ తాను సమాచార హక్కు చట్టం క్రింద అడిగిన సమాచారాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన లక్షెట్టి రాజమల్లు తనకు జి.ఓ. నం.59 క్రింద తన ఇంటి క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీ నగర్ కు చెందిన జనగామ రాజబాబు తాను జి.ఓ. నం.59 క్రింద దరఖాస్తు చేసుకొని రుసుము కూడా చెల్లించడం జరిగిందని, పట్టా ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన మేకల అక్షయ్ కుమార్ ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్, ఇతర నిధులు సత్వరమే మంజూరు చేసి గ్రామంలోని కాలనీలలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, గ్రామంలో శిథిలావస్థకు చేరిన జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలని కోరుతూ వేరువేరు దరఖాస్తులు అందజేశారు. మందమర్రి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జగ్గం బొందయ్య తనకు గ్రామ శివారులో గల భూమిలో కొందరు దౌర్జన్యంగా అక్రమంగా ఇల్లు నిర్మించుకుంటూ విక్రయాలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ప్రతినిధులు 3వ సమావేశాన్ని నిర్వహించి అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 56 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం బీర్సాముండా 151 జయంతిని పురస్కరించుకుని గ్రామస్థాయిలో చేపట్టిన జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు జన జాతీయ గౌరవ దివస్ లో భాగంగా గిరిజనుల చరిత్ర, వారసత్వం, స్వాతంత్ర పోరాటంలో పాత్ర, మౌలిక వసతులు కల్పన, చిత్రలేఖనం పోటీల నిర్వహణ, గిరిజన సంస్కృతి, స్వాతంత్ర సమరయోధులపై వ్యాసరచన, కథా రచన, కవితలు, క్విజ్ పోటీలు, చేతివృత్తులు, సంగీతం, నృత్యాలపై శిక్షణ శిబిరాలు, విద్య, పోషకాహారం, సంక్షేమ పథకాల అమలు, మొక్కలు నాటడం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, గిరిజన రంగాలలో ప్రతిభ చూపి ఆదర్శంగా నిలిచిన వ్యక్తులను సన్మానించడం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరువులైనవారు ప్రతి ఒక్క పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు



ఉమ్మడి చందానగర్ డివిజన్ లో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా కూకట్పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు ముఖ్య అతిథులుగా హాజరై ఉమ్మడి చందానగర్ డివిజన్ ముఖ్యనాయకులతో ఓటరు నమోదు కార్యక్రమం గురించి చర్చించడం జరిగినది.ఎం ఎల్ ఏ.ఎం ఎల్ సి మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్నందున ముఖ్య నాయకులు అందరూ కలిసి కట్టుగా ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి అని,డివిజన్ కి 3000 నుండి 4000 ఓట్లు నమోదు చేయించాలని అని,ప్రతి ఓటరు బీ.ఆర్.ఎస్ పార్టీకి ఓటు వేసేలా ప్రయత్నం చేయాలని సూచించడం జరిగినది. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి చందానగర్ డివిజన్ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కళ్యాణి, డైరెక్టర్ యేసులకు ఘన సన్మానం.



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ పాలనా పర్వంలో, పినపాక నియోజకవర్గ కిరీటంలో నూతన మణిపూసలుగా నిలిచిన అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ తోలెం కళ్యాణి, డైరెక్టర్ యేసు అపూర్వ సన్మాన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని అభినందించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు మద్దతుగా ఉంటూ మార్కెట్ కమిటీ కార్యకలాపాలలో పారదర్శకమైన పాలన అందించాలని నూతన నాయకులకు సూచించారు.దళారుల బారిన పడకుండా అన్నదాతలకు అండగా నిలవాలని తోలెం కళ్యాణి నాయకత్వంలో మార్కెట్ కమిటీ భవిష్యత్తులో స్వర్ణయుగాన్ని చూస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి ధన్యవాదాలు.

పినపాక మండలానికి తగిన గుర్తింపునిస్తూ, ఈ సముచిత అవకాశాన్ని ప్రసాదించిన స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకి మండల కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నూతన సారథులకు శుభాకాంక్షలు అందజేశారు.

రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి,

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, సంబంధిత సర్వేయర్లు,అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి మాట్లాడుతూ రీ-సర్వే కోసం కేటాయించిన ప్రతి గ్రామంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన సర్వే పనులు, రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను వేగవంతం చేసి, 9(2) నోటీసుల జారీ వరకు అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ, తమకు కేటాయించిన గ్రామాలలో అన్ని అంశాలను పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై రఘును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు.



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈ. బయ్యారం ఎస్సై రఘును పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో దిశా కమిటీ అధ్యక్షులు, పొట్లపల్లి గ్రామ సర్పంచ్ మద్దెల సమ్మయ్య, పాండురంగాపురం సర్పంచ్ భవతి, జగ్గారం సర్పంచ్ సుహాసిని, పాత రెడ్డిపాలెం సర్పంచ్ నాగకుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై రఘుతో ప్రజా సమస్యలు, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ శాఖ ప్రజలకు అందించే సేవలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండను కరువు జిల్లాగా ప్రకటించాలి :- సిపిఐ

ప్రభుత్వం తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలి.
-ఎల్నినో ప్రభావంతో ఏర్పడ్డ కరువు తీవ్రత పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి.
-ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించిన సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.
-రైతులను ఆదుకోవాలి, పంట నష్టానికి పరిహారం చెల్లించాలి.
-సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





వర్షాభావ పరిస్థితులతో నల్లగొండ జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఎండిపోతున్న పంటలను కాపాడలేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నల్లగొండను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన పరిహారం అందించి తక్షణమే ఆదుకోవాలని కోరారు.

సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన కరువు యాత్రలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండలం రామంతాపురం గ్రామంలో ఎండిపోతున్న వరి పంట పొలాలను పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి లు కలిసీ పరిశీలించారు.పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సాగు కోసం ఇప్పటివరకు చేసిన పెట్టుబడులు,అందుబాటులో ఉన్న నీటి వనరులు,బోర్లు,బావుల్లో నీటి మట్టం,విద్యుత్ సరఫరా పరిస్థితి,పంటల దిగుబడిపై పడుతున్న ప్రభావం తదితర అంశాలపై రైతులను అడిగి వివరాలు సేకరించారు.వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు తమ గోడును నాయకుల ఎదుట వెల్లబోసుకున్నారు.


ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డిండి ఆయకట్టు రైతులు వానాకాలం సీజన్‌లో రైతులు వేలాది రూపాయలు అప్పులు చేసి వరి,పత్తి తదితర పంటలను సాగు చేశారని తెలిపారు.సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయని,డిండి ప్రాజెక్ట్ లో నీరు పూర్తి స్థాయిలో పంటలకు రాకపోవడంతో పొట్టదశలో వేలాది ఎకరాల భూమి ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని డిండి మండల రైతంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.ముఖ్యంగా బోర్లు, బావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కూడా రైతుల కష్టాలను మరింత పెంచుతున్నాయని అన్నారు.

ఒకవైపు పెట్టుబడుల భారం, మరోవైపు పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కరువును జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఆర్థిక సాయం, సాగునీరు, విద్యుత్ సరఫరా,పంట నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.నల్లగొండ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి నల్లగొండను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని,పంటల బీమా పరిహారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని కోరారు.రైతులపై రుణభారం మరింత పెరగకుండా వ్యవసాయ రుణాల వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేసి రుణ ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు పూర్తిగా ఎండిపోకుండా నీటి వసతి ఉన్న ప్రాంతాల నుంచి అవసరమైన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల్లో సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, బోర్లు, బావులపై ఆధారపడిన రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రస్తుత పరిస్థితుల్లో పంటలతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి,మండల సహాయ కార్యదర్శులు తిప్పర్తి విజేందర్ రెడ్డి,బొల్లె శైలేష్,మండల కార్యవర్గ సభ్యులు ఎలిమినేటి హుస్సేన్,నూనె వెంకటేశ్వర్లు,సోమిడి శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎనమల్ల నవీన్,తిరుపారి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్,శాఖ కార్యదర్శులు చక్రి,శ్రీను,వెంకట్ రెడ్డి,అయోధ్య, రాములు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కాంపల్లి ప్రవీణ్,రైతులు పాల్గొన్నారు.

ఎస్. ఐ .ఆర్, ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి,



రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎలక్ట్రోరల్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు/మార్పులు, తొలగింపుల కొరకు ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా నుండి తొలగించిన ప్రతి ఓటరును, తొలగించడానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని, స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంలో అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో మానవత్వం విధి నిర్వహణలో నిబద్ధత పోలీసుల అసలైన లక్షణాలు



కానిస్టేబుల్ ప్రశాంత్ హోంగార్డు శ్రీనివాస్ లకు ప్రోత్సాహకాలు ప్రశంసా పత్రాలు అందజేత
ప్రజల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించడంతో పాటు ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు
ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయిన మహిళకు తక్షణ సహాయం అందించి మానవత్వం చాటుకున్న బ్లూకోట్ కానిస్టేబుల్ ప్రశాంత్ హోంగార్డు శ్రీనివాస్ చారిలకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రోత్సాహకాలు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు
ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ
పోలీసుల విధులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచి అవసరమైన సమయంలో తక్షణ సహాయం అందించడం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది మానవత్వం సేవాభావం నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ సమయస్ఫూర్తితో స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

మునుగోడు అభివృద్ధికి డిండి ఎత్తిపోతల పథకమే శాశ్వత పరిష్కారం

•ఎల్‌నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు అధిక పరిహారం అందించాలి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిండి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.
వికసిత్ భారత్ -- జి రామ్ జి కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం కరువు నివారణ చర్యలపై మునుగోడు నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మునుగోడు నియోజకవర్గం ఒకటని ఈ ప్రాంతానికి శాశ్వతంగా తాగు సాగునీటి సమస్యలను పరిష్కరించాలంటే డిండి ఎత్తిపోతల పథకం పూర్తి కావడమే మార్గమని పేర్కొన్నారు గత ప్రభుత్వం రిజర్వాయర్ల నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలనే అంశంపై స్పష్టత లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదని విమర్శించారు
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో చర్చించి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారులి
ప్రస్తుతం ఎదురైన సమస్యలను పరిష్కరించామని నాగర్‌కర్నూల్ వనపర్తి ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యేల సహకారంతో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.
మునుగోడు నియోజకవర్గంలోని చిన్న నీటి వనరులను పరిరక్షించేందుకు ఇప్పటికే 300 చెరువులను గుర్తించి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తులో నీటి కొరత రాకుండా చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ప్రాజెక్టు పరిస్థితి దెబ్బతిన్నదని ఫ్లోరైడ్ సమస్యతో వెనుకబడిన మునుగోడు నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. మునుగోడు అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తున్నానని అయితే తన కృషికి తగిన స్థాయిలో నిధులు రావడం లేదని అన్నారు.
ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారని మునుగోడు నియోజకవర్గ రైతులకు అధిక పరిహారం అందించేలా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కలెక్టర్‌ను కోరారు. పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు
రైతులకు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో ఆశించిన గిట్టుబాటు ధర లభించడం లేదని సేంద్రియ పద్ధతుల్లో వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించి అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించినప్పుడే రైతులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.రాబోయే వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి చుక్కను నిల్వ చేసుకునేలా ఇప్పటి నుంచే చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాలని రైతన్నలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ యాదాద్రి నల్లగొండ జిల్లాల అదనపు కలెక్టర్లు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి,




మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,



ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలు, వంటగది, భోజనశాల, పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించడంతోపాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు

స్వర్ణనంది పురస్కార గ్రహీత ఇంగె భాస్కర్‌కు ఘన సన్మానం

•రైతుల సంక్షేమానికి భాస్కర్ సేవలు అభినందనీయం: నాయకులు



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో సూరారం గ్రామానికి చెందిన ఉమ్మడి హనుమకొండ--కరీంనగర్ జిల్లాల రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇంగె భాస్కర్‌కు స్వర్ణనంది పురస్కారం లభించిన సందర్భంగా జిల్లా, మండల స్థాయి నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంగె భాస్కర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి, స్వర్ణనంది అవార్డు రావడం ఎంతో అందుకున్నందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

అశ్వారావుపేటలో పోలీసుల వాహన తనిఖీలు



పట్టణంలో ఎస్ఐ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను తనిఖీ చేస్తూ వాహనదారుల వద్ద అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్ఐ దేవ్ సింగ్ సూచించారు.
రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా పీవీ సింధు



02 నవంబర్ 2026

భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మరోసారి తన అద్భుతమైన ప్రతిభతో ప్రపంచ వేదికపై సత్తా చాటారు. జర్మనీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన హైలో ఓపెన్-రెండు వేల ఇరవై ఆరు బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎంతో పట్టుదలతో కైవసం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ కేజర్స్ ఫెల్ట్‌పై పీవీ సింధు పూర్తి ఆధిపత్యం చెలాయించి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన సింధు, వరుస గేమ్‌లలో ఇరవై ఒకటి-పన్నెండు, ఇరవై ఒకటి-పద్నాలుగు స్కోరుతో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి ట్రోఫీని ముద్దాడారు. దేశం గర్వించదగ్గ రీతిలో క్రీడా రంగంలో అసాధారణ విజయాలు సాధిస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం, మౌలిక వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం మరియు క్రీడా శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విశ్లేకులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ పీవీ సింధు సాధించిన ఈ చారిత్రాత్మక విజయం పట్ల దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అరవై లక్షల నకిలీ నోట్ల పట్టివేత



02 నవంబర్ 2026

తెలంగాణ: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సంచలనం సృష్టించిన భారీ నకిలీ నోట్ల రవాణా గుట్టును ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి రట్టు చేశాయి. జైపూర్ నుంచి ముంబై వెళ్తున్న ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో అత్యంత రహస్యంగా తరలిస్తున్న అరవై లక్షల రూపాయల విలువైన నకిలీ ఐదు వందల రూపాయల నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

.. నిఘా వర్గాల సమాచారం మేరకు రైల్వే స్టేషన్‌లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టగా ఈ భారీ ముఠా గుట్టు రట్టయింది. ఈ ఘటనకు సంబంధించి రాజస్థాన్‌కు చెందిన శివరతన్ మహియా (19) అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అయితే ఈ అక్రమ నకిలీ నోట్ల దందావకు సంబంధించిన ప్రధాన నిందితుడు ఓం ప్రకాష్ మాత్రం పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో ఇటువంటి అసాధారణ నేరాలు, నకిలీ కరెన్సీ చలామణి విచ్చలవిడిగా పెరుగుతున్నప్పటికీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థ మరియు ఆర్థిక నేరాల నియంత్రణ శాఖలు సమర్థవంతంగా వ్యవహరించడంలో విఫలమవుతున్నాయని, పాలకుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి అసామాజిక కార్యకలాపాలు హెచ్చుమీరుతున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి అమిత్ షా ప్రత్యేక పూజలు



02 నవంబర్ 2026

తెలంగాణ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం రోజున హైదరాబాద్ నగరంలో పర్యటిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ చేపట్టిన మహాపాదయాత్రలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, చార్మినార్ వద్ద అత్యంత ప్రసిద్ధి గాంచిన భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

. ఆలయానికి చేరుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తదితరులు ఉన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎమ్‌జె మార్కెట్ వరకు మహాపాదయాత్ర కొనసాగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకుల తీరును నిరసిస్తూ ఈ యాత్రను చేపడుతున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.

మైలార్ దేవ్‌పల్లిలో విషాదం.. ఎనిమిదేళ్ల బాలుడు ఆత్మహత్య



నవంబర్ 2026

తెలంగాణ: హైదరాబాద్ శివారు ప్రాంతమైన మైలార్ దేవ్‌పల్లిలో అత్యంత హృదయ విదారకరమైన ఘటన వెలుగు చూసింది. ఆదివారం రోజున ఎనిమిదేళ్ల చిన్నారి బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక వలస కార్మిక కుటుంబం మైలార్ దేవ్‌పల్లి పరిధిలోని లక్ష్మీగూడలో నివసిస్తోంది. రోజువారీ మాదిరిగానే తల్లిదండ్రులు ఉదయం పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని బాలుడు బలవన్మరణానికి ఉపయోగించుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బాలుడు ప్రాణాలు వదిలాడు. సాయంత్రం వేళ ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు కుమారుడి విగతజీవితాన్ని చూసి కన్నీరుమున్నీరవుతూ షాక్‌కు గురయ్యారు.

ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. చిన్న వయసులోనే బాలుడు ఇంతటి తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి గల అసలు కారణాలపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. వలస కుటుంబాల బతుకులు దుర్భరంగా మారడం, పిల్లల సంరక్షణపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం మరియు సంక్షేమ శాఖలు విఫలమవుతున్నాయని, నిత్యం ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నా పాలకుల నుంచి స్పందన కరువైందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

కరాటే పోటీల్లో మడుపల్లి విద్యార్థిని నవ్యశ్రీకి స్వర్ణ పతకం



మధిర, నవంబర్ 2

మధిర, నవంబరు 2: హైదరాబాద్‌లో నవంబరు 1న నిర్వహించిన తొలి తెలంగాణ రాష్ట్రస్థాయి బుడోకాన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మడుపల్లి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పొడుగు నవ్యశ్రీ ప్రతిభ చాటింది. పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని సాధించింది. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. నవ్యశ్రీకి కరాటేలో శిక్షణ ఇచ్చిన మాస్టర్ కుమారి నిఖితతో పాటు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

క్రీడల్లోనే కాకుండా చదువులోనూ నవ్యశ్రీ చురుకుగా ఉంటూ సైన్స్, గణితం, సాంఘిక శాస్త్ర అంశాల్లో ఆసక్తి కనబరుస్తోందని ఉపాధ్యాయులు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో అన్ని రంగాల్లో రాణిస్తున్న నవ్యశ్రీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు ఉచిత క్రియా యోగా శిక్షణ

- యోగా, ఆయుర్వేదం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన
- విజేత హైస్కూల్ విద్యార్థులకు డా. సత్యం స్వామీజీ మార్గదర్శనం



నిర్మల్ జిల్లా నవాబ్‌పేట్‌లోని సత్యం ట్రెడిషనల్ మెడిసినల్ ట్రీట్మెంట్ యోగాశ్రమం ఆధ్వర్యంలో ఖానాపూర్‌కు చెందిన విజేత హైస్కూల్ విద్యార్థులకు ఉచిత క్రియా యోగా తరగతులు నిర్వహించారు. యోగాశ్రమ ప్రాంగణంలో డా. సత్యం స్వామీజీ స్వయంగా విద్యార్థులకు క్రియా యోగాలో శిక్షణనిస్తూ, యోగా, ఆయుర్వేదం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. సత్యం స్వామీజీ క్రియా యోగా ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులతో స్వయంగా యోగా సాధన చేయించారు. ప్రతిరోజూ యోగా అభ్యసించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఆయుర్వేద వైద్య విధానాల గురించి వివరిస్తూ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులు యోగాశ్రమ ప్రాంగణాన్ని సందర్శించి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరంగా గడిపారు. ఆశ్రమంలో పెంచుతున్న పచ్చని చెట్లు, మియాజాకి మామిడి, ప్యాషన్ ఫ్రూట్, నోని, అవకాడో తదితర అరుదైన పండ్ల మొక్కలను ఆసక్తిగా పరిశీలించారు. వివిధ రకాల మొక్కల గురించి తెలుసుకుంటూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకున్నారు. ప్రతి విద్యార్థి ఐదు మొక్కలు నాటి సంరక్షించాలి ఈ సందర్భంగా డా. సత్యం స్వామీజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీసం ఐదు మొక్కలు నాటి, అవి పెద్దయ్యే వరకు బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎదురయ్యే కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడానికి పచ్చదనం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం విద్యార్థులకు యోగా, ఆయుర్వేదం, ప్రకృతి పరిరక్షణపై విజ్ఞానాన్ని అందించడంతో పాటు ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించింది.

కార్యక్రమంలో విజేత హైస్కూల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సత్యం ట్రస్ట్ ట్రెజరర్ మేడి చంద్రశేఖర్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి ఆగకూడదంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి – టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి పిలుపు

- వగురురు, తిమ్మాపురం గ్రామాల్లో రోడ్ షో ద్వారా విస్తృత ప్రచారం
- రెండు గ్రామాలకు రూ.86 లక్షల సీసీ రోడ్లు, కోటి రూపాయలకు పైగా జలజీవన్ నిధులు మంజూరు



మంత్రాలయం -

మంత్రాలయం మండలంలోని వగురురు, వి.తిమ్మాపురం గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి రోడ్ షో నిర్వహించి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. ఈ నెల 5న జరిగే ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థి ఆర్.లక్ష్మయ్యకు, ఎంపీటీసీ అభ్యర్థి నరసప్పకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. వగురురులో రూ.62 లక్షలు, తిమ్మాపురంలో రూ.24 లక్షలు కలిపి మొత్తం రూ.86 లక్షలతో సీసీ రోడ్లకు నిధులు కేటాయించామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా వగురురుకు రూ.99.4 లక్షలు, తిమ్మాపురంకు రూ.16.2 లక్షలు కేటాయించామన్నారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా వగురురుకు రూ.6,30,911, తిమ్మాపురంకు రూ.40,795 మంజూరు చేశామన్నారు.

వగురురులో నరసప్ప దేవాలయానికి రోడ్డు వేయించే బాధ్యత, తిమ్మాపురంలో చావిడి కట్టించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నవారికి ఓటు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందని, ఎమ్మెల్యే సొంత గ్రామంలోనే రోడ్లు లేని పరిస్థితిలో మిగతా గ్రామాలకు ఏం చేస్తారో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

3 నూతన బోర్ల ను మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి చేతుల ప్రారంభించిన

యాదాద్రి భువనగిరి జిల్లా
నవంబర్ 2:





ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేస్తాను: మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి భువనగిరి పట్టణం 30వ వార్డు పహడినగర్ లో మున్సిపల్ కౌన్సిలర్ ఎండి. లయిక్ అహ్మద్ ఆధ్వర్యంలో 3 నూతన బోర్లను మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి చేతులమీదుగాఘనంగాప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ. శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పట్టణంలో ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చేస్తామని, ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడాలని కోరారు.

కౌన్సిలర్ఎండీ లయిక్ అహ్మద్ మాట్లాడుతూ...

గతంలో ఎమ్మెల్యే వార్డుకు వచ్చినప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఈ బోర్లను మంజూరు చేయించడం జరిగిందని, వార్డు ప్రజల పక్షాన ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే గారి సహకారంతో, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కమిషనర్ గారి సహాయంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

వైస్ చైర్ పర్సన్ మంజుల మాట్లాడుతూ...

పహడినగర్ లో చాలా కాలంగా ఉన్న మంచినీటి సమస్యను తీర్చడానికి కౌన్సిలర్ లయిక్ అహ్మద్ ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ డి ఈ , ఎఇ ఏఈఈ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, జబ్బార్, ఎం.డి. కామిల్, ఎం.డి. సల్మాన్ ఖాన్, వస్తువుల సాయి, వాటర్ సప్లై లైన్ మెన్ జి. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలదోనలో ఎంపీటీసీ అభ్యర్థి చిలుక లక్ష్మికి మద్దతుగా ప్రచారం

- ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం
- అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జై హనుమంతు పిలుపు





మంత్రాలయం -:

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకలదోన గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ అభ్యర్థి చిలుక లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ కార్యకర్తలు ప్రచారం చేశారు.

జై హనుమంతు ఆధ్వర్యంలో తిక్కయ్య, పెద్ద రాముడు,దత్తాత్రేయ,చిలుకగోవిందు,రామలింగడు. తదితరులు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో జి.భూపతి నరసింహులు, వినయ్ కుమార్, ప్రతాప్, నివాసు,. సుధాకర్ దేవరం బీటీ రఘు.. జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ముత్తన్న.. వీరేష్ శివరాముడు. రామకృష్ణ.. రంగన్న. మలికంటపుగారి రంగన్న.. పాండు.. బడిశెట్టి దొడ్డయ్య..నర్సిరెడ్డి. మరియు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు....

బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధించిన ఖమ్మం పోక్సో కోర్టు

మధిర, నవంబర్ 2

మధిర: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో ఫాస్ట్‌ట్రాక్ (పోక్సో) కోర్టు తీర్పు వెలువరించింది.మధిర పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2025లో నమోదైన క్రైమ్ నంబర్ 87/2025 కేసులో మధిరకు చెందిన గడ్డాల అరవింద్ అలియాస్ చిన్ని (35) నిందితుడిగా ఉన్నాడు. ఇతనిపై బీఎన్ఎస్ సెక్షన్ 65(2), పోక్సో చట్టం 2012లోని సెక్షన్ 5 r/w 6 కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.విచారణలో నేరం రుజువు కావడంతో ఖమ్మం రెండో ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పుల్లభట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.ఈ కేసును ఏసీపీ రహేమాన్ దర్యాప్తు చేయగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శరత్ కుమార్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. భరోసా లీగల్ ఆఫీసర్ ఎం. ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ వై. నాగేశ్వరరావు, లైజన్ అధికారులు ఎస్సై శ్రీకాంత్, ఆర్. నాగేశ్వరరావు, హోంగార్డు అయూబ్ తదితరులు కేసు విచారణలో సహకరించారు. మధిర పట్టణ సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కోర్టు సమన్వయంతో వ్యవహరించారు.

ఘనంగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జన్మదిన వేడుకలు



మధిర, నవంబర్ 2

మధిర: ఖమ్మం పార్లమెంట్ టీడీపీ కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జన్మదిన వేడుకలు 02.11.26 మధిరలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ పట్టణ, మండల నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ రామనాథం కృతజ్ఞతలు తెలిపారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ

టాస్క్-అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం.. ప్రభుత్వంపై, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేదు : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02: తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్ పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (ూూఖ), ప్రముఖ అంతర్జాతీయ సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ూఔూ) భాగస్వామ్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఇందుకు సంబంధించిన ఒప్పందంపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాసంస్థలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

643 కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా టాస్క్‌తో అనుబంధంగా ఉన్న 643 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ అందించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక అంశాల్లో నైపుణ్యాలను



పెంపొందించనున్నారు.
కేవలం సైంటిఫిక్, టెక్నికల్ విద్యార్థులకే కాకుండా ఆర్ట్స్, కామర్స్ వంటి నాన్-స్టెమ్ విభాగాల విద్యార్థులకు కూడా ప్రత్యేక శిక్షణ మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తద్వారా అన్ని విద్యా విభాగాల విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ ఆధారిత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించనున్నారు.

900కు పైగా ఆన్‌లైన్ కోర్సులకు ఉచిత ప్రవేశం

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా 900కు పైగా డిజిటల్ కోర్సులను ఒక సంవత్సరం పాటు ఉచితంగా అభ్యసించే అవకాశం కల్పించనున్నారు. అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లను కూడా అందించనున్నారు.
కేవలం తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ ద్వారా ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు. పరిశ్రమల నిపుణులతో ప్రత్యేక సమావేశాలు, హ్యాకథాన్‌లను నిర్వహించి విద్యార్థులకు వాస్తవిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నారు.

శిక్షణ పూర్తిచేసిన వారికి ప్రత్యేక జాబ్ ఫెయిర్లు

ఈ కార్యక్రమంలో మరో కీలక అంశంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ప్రత్యేక ఉద్యోగ మేళాలను నిర్వహించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.
అలాగే కళాశాలల అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ అందించనున్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేలా అధ్యాపకుల సామర్థ్యాన్ని పెంపొందించనున్నారు.

భవిష్యత్ టెక్నాలజీ రంగాలకు తెలంగాణ యువతను సిద్ధం చేసే లక్ష్యం

ప్రపంచవ్యాప్తంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. అంతర్జాతీయ సంస్థతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, సర్టిఫికేషన్ అవకాశాలు కల్పించనున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు, టాస్క్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని లక్ష మంది విద్యార్థులు భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కలగనుంది.

మహిళా వ్యాపారాలకు పెట్టుబడులే లక్ష్యం

మంత్రి సీతక్క అధ్యక్షతన ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:
మహిళల నేతృత్వంలోని వ్యాపారాలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన మద్దతును పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (డబ్ల్యూఈఈసీ)ను ఏర్పాటు చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'కు ముందుగా ఈ కౌన్సిల్ చర్చలు చేపట్టనుంది.మంత్రి డి. అనసూయ సీతక్క అధ్యక్షతన ఏర్పాటైన కౌన్సిల్‌కు వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. విధాన రూపకర్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురానున్నారు.మహిళా వ్యాపారాలను ప్రోత్సహించడం సంక్షేమ అంశంతోపాటు ఆర్థిక పోటీతత్వానికి సంబంధించిన విషయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నగరాలు, గ్రామాలు, స్వయం సహాయక సంఘాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలకు అనుకూలమైన రుణాలు, మార్కెట్లు, ప్రభుత్వ విధానాలు అవసరమన్నారు. వారి ఎదుగుదలకు అడ్డంకులను తొలగించేందుకు వీ హబ్ నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.కౌన్సిల్ నాలుగు ప్రధాన విభాగాల్లో పనిచేయనుంది. విధానాలు--సంస్థాగత నాయకత్వానికి దివ్య దేవరాజన్, పట్టణ ఆవిష్కరణలు--వ్యవస్థాపకతకు నయ్యా సాగి, సామాజిక ప్రభావం--సమ్మిళిత వ్యాపారాలకు డాక్టర్ హరీశ్ హండే, పెట్టుబడులు--కార్పొరేట్ భాగస్వామ్యాలకు అంకితా వశిష్ఠ నాయకత్వం వహించనున్నారు.రానున్న 12 నుంచి 24 నెలల్లో రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేయగల చర్యలు, విస్తరించగల నమూనాలపై కౌన్సిల్ దృష్టిసారించనుంది. చర్చల సిఫార్సులతో ఈవై ప్రచురణ భాగస్వామిగా మహిళా పారిశ్రామికవేత్తల స్థితిగతులపై శ్వేతపత్రాన్ని రూపొందించి సదస్సులో విడుదల చేయనున్నారు. మహిళలకు మూలధనం, వినియోగదారులు, వ్యాపార నెట్‌వర్క్‌లతో అనుసంధానాన్ని మెరుగుపరచడమే ప్రధాన అవసరమని సీతా పల్లచోళ్ల తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి: అమిత్ షా

చొరబాటుదారులను దేశం నుంచి తరిమికొడతాం.. ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుకోవాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోంది

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:
కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ నిర్వహిస్తున్న ర్యాలీలు చొరబాటుదారులను కాపాడేందుకేనని విమర్శించారు. దేశంలో కేవలం అర్హులైన పౌరులకే ఓటు హక్కు ఉండాలనే లక్ష్యంతోనే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ చేపడుతున్నామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి బయటకు పంపిస్తామని హెచ్చరించారు.
హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగం కావడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలే కారణమని అమిత్ షా గుర్తుచేశారు. నిజాం పాలనకు ముగింపు పలికి హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించిన ఓటు బచావో ర్యాలీపై అమిత్ షా విమర్శలు గుప్పించారు. అది ఓటు బచావో ర్యాలీ కాదని, చొరబాటుదారులను కాపాడే ర్యాలీ అని ఎద్దేవా చేశారు. చొరబాటుదారులు కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకుగా మారారని, అందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితాలోని అక్రమాలు, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తున్నామని వివరించారు. 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకు సమాధానమిస్తూ.. 4.25 కోట్ల మందికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని, మూడు కోట్ల మంది మరణించారని, కోటి మందికి డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, మరో మూడు కోట్ల ఓట్లకు సంబంధించి ఓటర్లు అందుబాటులో లేరని పేర్కొన్నారు. ఇలాంటి ఓట్లను కూడా కొనసాగించాలా? అని ప్రశ్నించారు.
ప్రజల మద్దతుతోనే బీజేపీ విజయాలు
ఎస్ఐఆర్ వల్లే బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను అమిత్ షా ఖండించారు. 2014లో నరేంద్ర మోదీ



ప్రధానమంత్రి అయినప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ లేదని, 2019లోనూ అది జరగలేదని గుర్తుచేశారు. మరి ఆ ఎన్నికల్లో బీజేపీ ఎలా గెలిచిందో రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే బీజేపీ విజయాలు సాధించిందన్నారు. అస్సాంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చామని, ఢిల్లీలో 30 ఏళ్ల తర్వాత విజయం సాధించామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్‌పై తీవ్ర విమర్శలు

మాక్ పార్లమెంట్ నిర్వహించిన ప్రతిపక్షాలపై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసలైన పార్లమెంటులో ప్రధానమంత్రి కాలేరని, కనీసం మాక్ పార్లమెంటులోనైనా ప్రధాని పాత్ర పోషించాలని రాహుల్ గాంధీని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే కాంగ్రెస్ నేతలు దానికి తగిన గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. ఈవీఎంలు, ఎస్ఐఆర్, చొరబాటుదారుల అంశాలపై పార్లమెంటులో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, రాహుల్ గాంధీకి దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఈవీఎంలపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హయాంలో అవినీతి.. మోదీ పాలనలో అభివృద్ధి

కేంద్రంలో పదేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని అమిత్ షా ఆరోపించారు. మోదీ ప్రభుత్వం 12 ఏళ్లుగా పాలిస్తున్నప్పటికీ ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని పేర్కొన్నారు.

తమిళనాడులో 64 ఏళ్లుగా, పశ్చిమ బెంగాల్‌లో 54 ఏళ్లుగా, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో 41 ఏళ్లుగా, త్రిపురలో 36 ఏళ్లుగా, ఒడిశాలో 26 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని గుర్తుచేశారు. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమికి ఎస్ఐఆర్ కారణమా? అని ప్రశ్నించారు.
కాంగ్రెస్ పార్టీ బలహీనపడిపోయిందని, మోదీకి ఉన్న ప్రజాదరణతో పోటీ పడే పరిస్థితిలో లేదని విమర్శించారు. తెలంగాణలో కూడా బీజేపీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే కాంగ్రెస్‌ను ఓడించడం సాధ్యమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణను అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాష్ట్రాన్ని కాపాడలేవని ఆరోపించారు. తెలంగాణను కాపాడగలిగేది ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ మాత్రమేనని అన్నారు.

మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు

ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాదంపై పోరాటం, నక్సలిజం నిర్మూలన వంటి కీలక నిర్ణయాలను మోదీ ప్రభుత్వం అమలు చేసిందని అమిత్ షా పేర్కొన్నారు. దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడమే తదుపరి లక్ష్యమని తెలిపారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని, ఆ లబ్ధిదారులను చూస్తేనే రాహుల్ గాంధీకి సమాధానం చెప్పడం కష్టమవుతుందని వ్యాఖ్యానించారు. చివరగా తెలంగాణ బీజేపీ కార్యకర్తలకు అమిత్ షా పిలుపునిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగుల నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:
ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు, కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు తమ హక్కులను కాపాడాలని సోమవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. బ్యాంకు ఉద్యోగులకు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి మద్దతుగా పాల్గొని.. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం తీరును ఖండించారు. ఐడీబీఐ బ్యాంక్ నష్టాల్లో ఉన్నప్పుడు, ఎల్ఐసీని భాగస్వామ్యం చేసిన కేంద్రం, ఇప్పుడు వరుస లాభాలతో ముందుకు సాగుతున్న ఐడీబీఐ బ్యాంక్ ను ప్రైవేటు పరం చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. నిబంధనలు తుంగలో తొక్కి ఫెయిర్ ఫ్యాక్స్ సంస్థకు కారు చౌకగా కట్టబెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు.

భిన్నాభిప్రాయాలే ప్రజాస్వామ్యానికి బలం: ఓం బిర్లా

సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమమే ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:
ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో ఏకాభిప్రాయం, భిన్నాభిప్రాయం రెండూ కీలకమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొత్త ఆలోచనలకు అవకాశం కల్పించి, పాలనలో లోపాలను గుర్తించేందుకు దోహదపడే అసమ్మతిని స్వాగతించాలని, గౌరవించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. రాజకీయ, పార్టీ, సిద్ధాంత విభేదాలకు అతీతంగా రాష్ట్రం, దేశ ప్రగతే అందరి ఉమ్మడి లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.
సంవిధాన్ పక్షోత్సవాల్లో భాగంగా హర్యానా శాసనసభ ఆధ్వర్యంలో పంచకులలో సోమవారం నిర్వహించిన 'జనప్రతినిధి సమ్మేళన్'ను ఓం బిర్లా ప్రారంభించారు. ప్రస్తుత, మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.. హర్యానా ఆరు దశాబ్దాల అభివృద్ధి ప్రయాణం భారత ప్రజాస్వామ్య బలానికి, స్థైర్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.
ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుని దేశ ఆహార భద్రతకు తోడ్పడుతున్న హర్యానా రైతులను ఆయన అభినందించారు. దేశ రక్షణలో రాష్ట్ర యువత చూపుతున్న సాహసాన్ని, అంతర్జాతీయ క్రీడా వేదికలపై క్రీడాకారులు సాధిస్తున్న విజయాలను ప్రశంసించారు.
భారత రాజ్యాంగం కేవలం ప్రభుత్వ నిర్వహణకు మార్గదర్శక చట్రం మాత్రమే కాదని, దేశ ఆత్మగా, నైతిక దిక్సూచిగా నిలుస్తోందని బిర్లా అన్నారు. భాషా, సాంస్కృతిక, మత



వైవిధ్యాల మధ్య దేశాన్ని ఏకతాటిపై నిలిపిన రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.
శాసనసభ్యుల పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ బాధ్యత ముగియదని ఆయన స్పష్టం చేశారు. పాలనను క్షేత్రస్థాయిలో ప్రజల సాధికారతకు సాధనంగా చూడాలని సూచించారు. సమాజంలోని అత్యంత బలహీనవర్గాల జీవితాల్లో స్పష్టమైన సామాజిక, ఆర్థిక మార్పు తీసుకురావడమే ప్రజాజీవితానికి నిజమైన కొలమానమని పేర్కొన్నారు. అర్థవంతమైన చర్చలు, సభా మర్యాదల పరిరక్షణలో హర్యానా శాసనసభ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.
కార్యక్రమంలో హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, శాసనసభ స్పీకర్ హర్విందర్ కల్యాణ్, ప్రతిపక్ష నేత భూపీందర్ సింగ్ హుడా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మహిపాల్ ధండా, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ క్రిషన్ లాల్ మిద్ధా పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02 :
స్కిల్ యూనివర్సిటీలో త్వరలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ సదస్సును విజయవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని మంత్రి అధికారులకు సూచించారు. అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి హాజరయ్యే ప్రముఖులు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.



ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

12
మంగళవారం నవంబర్ 03, 2026
www.trinetnews.com

చిన్ననాటి నుంచే నృత్య కళలను ప్రోత్సహించాలి







రవీంద్రభారతిలో స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

పాఠశాల స్థాయి నుంచే చిన్నారులను శాస్త్రీయ సంగీతం, నృత్య కళల పట్ల ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లెంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం రవీంద్రభారతిలో శ్రీ వాగ్దేవి వైద్య సంగీత కళ నృత్య సంస్కృతి సంస్థ, శ్రీ నటరాజ నృత్య సంగీత అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో 'స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం' నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం, నృత్య కళలు మన వారసత్వ సంపద అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ కళా సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. భావితరాలకు సంప్రదాయ కళలను అందించడంలో సమాజం బాధ్యతగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. చిన్నారులను కళల వైపు ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆసక్తిని పెంపొందించవచ్చని వక్తలు సూచించారు. పాఠశాల దశ నుంచే శాస్త్రీయ కళల పరిచయం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

సమ్మేళనంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చిన్నారి కళాకారుల ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంగీతం, వాద్యం, నృత్య కళల సమ్మేళనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులకు, గురువులకు పురస్కారాలను ప్రదానం చేశారు. యువ కళాకారులకు 'నాట్య రవళి' అవార్డులను, గురువులకు 'నృత్య చూడామణి' అవార్డులను అందజేశారు. చిన్నారుల కళా ప్రదర్శనలతోపాటు యువ కళాకారులు, గురువుల సత్కారాలకు ఈ సమ్మేళనం వేదికైంది.

ఈ కార్యక్రమంలో సామాజికవేత్త వీర భోగ వసంత రాయులు, టీజీ సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్, నిర్వాహకులు బి. నాగేంద్ర యాదవ్, దివ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సంప్రదాయ కళల పరిరక్షణ, చిన్నారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని కార్యక్రమం ప్రధానంగా చాటిచెప్పింది.

ఘనంగా 'నృత్య తరంగిణి--2026' శాస్త్రీయ నృత్య పోటీలు





కళా ప్రతిభకు వేదికగా నిలిచిన ఎన్టీఆర్ ఆడిటోరియం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

జాకీ డ్యాన్స్ అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో 'నృత్య తరంగిణి--2026' శాస్త్రీయ నృత్య పోటీలు ఆదివారం నాంపల్లిలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమం శాస్త్రీయ నృత్య కళకు, కళాకారుల ప్రతిభా ప్రదర్శనకు వేదికగా నిలిచింది. భారతీయ సంప్రదాయ కళల విశిష్టతను చాటేలా పోటీలను నిర్వహించారు.

నృత్య సాధనలో నేర్చుకున్న మెళకువలను వేదికపై ప్రదర్శించేందుకు ఇటువంటి పోటీలు కళాకారులకు మంచి అవకాశాన్ని కల్పిస్తాయి. అభినయం, లయ, తాళం, భావ వ్యక్తీకరణ వంటి అంశాల్లో తమ నైపుణ్యాన్ని చాటుకునేందుకు నృత్య తరంగిణి కార్యక్రమం అవకాశం కల్పించింది. శాస్త్రీయ నృత్యంపై ఆసక్తిని పెంపొందించడంతోపాటు సంప్రదాయ కళలను ప్రోత్సహించే కార్యక్రమంగా నిలిచింది.

కార్యక్రమ ఆహ్వాన పత్రంలో ముఖ్య అతిథులుగా ఏపీపీసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి. శ్రీనివాస్ రఘు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కొత్త శ్రీనివాస్ పేర్లను పేర్కొన్నారు. గౌరవ అతిథిగా సామాజిక కార్యకర్త కొత్త కృష్ణవేణిని, ప్రత్యేక అతిథులుగా సీనియర్ నటీమణులు లతాశ్రీ, శ్రుతిని ఆహ్వానించారు.

సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేయడంలో శాస్త్రీయ నృత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. క్రమశిక్షణతో కూడిన సాధన, గురువుల మార్గదర్శకత్వం కళాకారుల ఎదుగుదలకు పునాదులుగా నిలుస్తాయి. నేర్చుకున్న విద్యను ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శించడం ద్వారా కళాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పోటీ వేదికలు పరస్పరం ప్రతిభను తెలుసుకోవడానికి, ప్రదర్శన పద్ధతులను గమనించడానికి ఉపయోగపడతాయి.

ఈ నేపథ్యంలో నిర్వహించిన నృత్య తరంగిణి పోటీలు కళా సాధనకు ప్రాధాన్యమిచ్చే సాంస్కృతిక కార్యక్రమంగా నిలిచాయి. నగరంలోని ఎన్టీఆర్ ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమం శాస్త్రీయ నృత్య కళకు ప్రోత్సాహాన్ని అందించింది. కళాకారులకు వేదికను కల్పించడంలో జాకీ డ్యాన్స్ అండ్ ఈవెంట్స్ నిర్వహించిన ఈ పోటీలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.





విపత్తుల ముందస్తు హెచ్చరికల వ్యవస్థ బలోపేతం

కిష్ట్వార్‌లో భూకంప పరిశీలన కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
వాతావరణ హెచ్చరికలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని పిలుపు



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు జమ్మూకశ్మీర్‌లో వాతావరణ పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరికల వ్యవస్థలను విస్తరిస్తున్నట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అధిక భూకంప ముప్పు ఉన్న కిష్ట్వార్‌లో నూతన భూకంప పరిశీలన కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శాస్త్రీయ హెచ్చరికలను ప్రజలు విశ్వసించి, అధికారుల సూచనలను పాటించినప్పుడే ప్రాణనష్టాన్ని తగ్గించగలమని స్పష్టం చేశారు.

అత్యాధునిక డిజిటల్ భూకంప పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రాంతంలోని భూకంప కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తుందని మంత్రి వివరించారు. సేకరించిన సమాచారాన్ని న్యూఢిల్లీలోని జాతీయ భూకంప విజ్ఞాన కేంద్రానికి చెందిన 24 గంటల పర్యవేక్షణ కేంద్రానికి ఎప్పటికప్పుడు పంపుతుందన్నారు. ఈ కేంద్రంతో జమ్మూకశ్మీర్‌లో భూకంప పరిశీలన కేంద్రాల సంఖ్య నాలుగుకు చేరిందని, జమ్మూ, శ్రీనగర్, ఉధంపూర్‌లలో ఇప్పటికే కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

భూకంప ముప్పును మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని జితేంద్ర సింగ్ చెప్పారు. విపత్తుల సమయంలో జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు సమర్థంగా స్పందించేందుకు, సురక్షిత మౌలిక సదుపాయాల నిర్మాణ ప్రణాళికలకు తోడ్పడుతుందన్నారు. గత ఏడాది చసోటి ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక కుంభవృష్టి విపత్తు అనంతరం అదనపు పర్యవేక్షణ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

2014లో ఈ ప్రాంతంలో ఒక్క డాప్లర్ వాతావరణ రాడార్ కూడా లేదని, అనంతరం బనిహాల్, జోత్, జమ్మూ, శ్రీనగర్‌లలో నాలుగు రాడార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దోడా, కిష్ట్వార్, అనంతనాగ్, బారాముల్లాలో మరో నాలుగు రాడార్లను 2027లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వీటితో మొత్తం రాడార్ల సంఖ్య ఎనిమిదికి చేరుతుందని చెప్పారు.

స్వయంచాలక వాతావరణ కేంద్రాల సంఖ్య మూడునుంచి 12కు పెరిగిందని మంత్రి వివరించారు. గతంలో ఉధంపూర్, కథువా, రాంబన్‌లలో మూడు కేంద్రాలు ఉండగా, కొత్తగా కిష్ట్వార్‌లో నాలుగు, దోడా, రాంబన్‌లలో రెండేసి, కథువాలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిపాలనా సరిహద్దులు మారినా భౌగోళిక సవాళ్లు కొనసాగుతాయని, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

తన పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఐదు జిల్లాల్లో వర్షపాత నమోదు కేంద్రాల సంఖ్య తొమ్మిదినుంచి 15కు పెరిగిందన్నారు. అన్ని పంచాయతీలకు వాతావరణ అంచనాలను చేరవేస్తున్నామని, వాతావరణ సమాచారం, వ్యవసాయ వాతావరణ సలహా సేవలు 5,467 మంది లబ్ధిదారులకు అందాయని తెలిపారు. పట్నిటాప్‌లోని ఎత్తైన ప్రాంత మేఘ భౌతిక శాస్త్ర ప్రయోగశాల, జమ్మూలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం కూడా పర్యవేక్షణ సేవలను బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు.

వాతావరణ హెచ్చరికల మేరకు ప్రయాణ ఆంక్షలు విధించిన అనంతరం రహదారి దెబ్బతిన్న ఘటనను మంత్రి గుర్తుచేశారు. "సమాచారం అందడం ఎంత ముఖ్యమో, దానిని అనుసరించడం కూడా అంతే ముఖ్యం" అని అన్నారు. హెచ్చరికల సమయంలో ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. నిర్ధారణలేని, భయాందోళనలు కలిగించే ప్రచారాలకు బదులుగా శాస్త్రీయ ఆధారాలు, విశ్వసనీయ వనరుల సమాచారాన్ని అనుసరించాలని సూచించారు.

మెరుగైన రవాణా అనుసంధానం, ప్రధాన విద్యుదుత్పత్తి కేంద్రంగా కిష్ట్వార్ అభివృద్ధితో ఈ ప్రాంతం పురోగమిస్తోందని మంత్రి తెలిపారు. మారుమూల ప్రాంతాల యువత సైతం సాంకేతికత, డిజిటల్ వేదికలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కేంద్ర భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస కుమార్ తుమ్మల, సీనియర్ శాస్త్రవేత్త సురేశ్, జమ్మూకశ్మీర్ శాసనసభ ప్రతిపక్ష నేత సునీల్ శర్మ, కిష్ట్వార్ ఎమ్మెల్యే షగున్ పరిహార్, జిల్లా డిప్యూటీ కమిషనర్ పంకజ్ శర్మ, ఎస్ఎస్పీ సన్నీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో రైతు లాభాలే పరిశోధనల లక్ష్యం కావాలి

పదేళ్లలో ఉత్పత్తిని 75 మిలియన్ టన్నులకు పెంచాలి: డాక్టర్ ఎం.ఎల్. జాట్



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 02:

వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ సేవలు రైతుల ఆదాయాన్ని పెంచి, వారి జీవనోపాధిని మెరుగుపరిచేలా ఉండాలని వ్యవసాయ పరిశోధన, విద్యాశాఖ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ అన్నారు. హైదరాబాద్‌లోని జేడీ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ప్రారంభమైన తొలి అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సులో ఆయన ప్రసంగించారు. మారుతున్న ప్రపంచంలో ఆహారం, పశుదాణా, మేత, ఇంధనం, సుస్థిరత కోసం మొక్కజొన్న విప్లవం అనే ఇతివృత్తంతో నవంబర్ 2 నుంచి 4 వరకు ఈ సదస్సు జరుగుతోంది.

భారత్‌లో మొక్కజొన్న ఉత్పత్తి సుమారు 55 మిలియన్ టన్నులకు చేరడం పట్ల జాట్ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే పదేళ్లలో ఉత్పత్తిని 75 మిలియన్ టన్నులకు పెంచడంతోపాటు ఉత్పాదకతను మరో 1.5 రెట్లు పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక ఆవిష్కరణలు, మెరుగైన పంట యాజమాన్యం, వనరుల సమర్థ వినియోగంతో ఈ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఆహారం, పశుదాణా, మేత, ఇంధనానికి ప్రాధాన్యమిచ్చే '4ఎఫ్' విధానానికి రైతులను జోడించి '5ఎఫ్' దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. నూనెగింజలు, పప్పుధాన్యాల సాగుకు ఆటంకం కలగకుండా సీజన్లు, వ్యవసాయ వాతావరణ ప్రాంతాలకు అనుగుణంగా మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని చెప్పారు. రైతులకు సరసమైన ధరల్లో నాణ్యమైన విత్తనాలు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ హైబ్రిడ్లు అందుబాటులో ఉండేలా పటిష్ఠమైన విత్తన వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు.

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డి.కె. యాదవ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో 329 మొక్కజొన్న హైబ్రిడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అధిక దిగుబడి, మెరుగైన పోషక విలువలు, చీడపీడలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే రకాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. యాంత్రీకరణ, సాగు వనరుల సమర్థ వినియోగం, ప్రభుత్వ రంగ హైబ్రిడ్ విత్తనోత్పత్తిని బలోపేతం చేయాలని సూచించారు.

ప్రముఖ మొక్కజొన్న శాస్త్రవేత్త, పద్మశ్రీ డాక్టర్ ఎస్. వాసల్ రైతుల అవసరాలకు అనుగుణంగా సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన పంట ప్రజనన పద్ధతులను అనుసరించాలని సూచించారు. ముఖ్య అతిథి పద్మభూషణ్ డాక్టర్ ఆర్.ఎస్. పరోడా మాట్లాడుతూ.. ఆధునిక ప్రజనన సాంకేతికతలు, జన్యువనరుల సంరక్షణ, విలువ గొలుసుల బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆహారం, పశుదాణా భద్రత కోసం అఫ్లాటాక్సిన్ కలుషితాన్ని సమర్థంగా నియంత్రించాలని పేర్కొన్నారు.

మొక్కజొన్న టెక్నాలజిస్టుల భారత సంఘం అధ్యక్షుడు డాక్టర్ హెచ్.ఎస్. జాట్ పరిశోధనా సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెరగాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రీయ ప్రచురణలను విడుదల చేసి, మొక్కజొన్న పరిశోధనలకు విశేష సేవలందించిన శాస్త్రవేత్తలు, పరిశోధకులకు పురస్కారాలు అందజేశారు.

జాతీయ స్థాయిలో తాజ్‌పూర్ గ్రామానికి గుర్తింపు సర్పంచ్ దంపతులకు ఘన సన్మానం

యాదాద్రి భువనగిరి, నవంబరు02/ట్రైనెట్ న్యూస్:



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ దంపతులు జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గుజరాత్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న 'రాష్ట్రీయ ఏక్తా దివస్' వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం మేరకు వారు హాజరయ్యారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయి వేడుకల్లో పాల్గొని తాజ్‌పూర్ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన సర్పంచ్ దంపతులను గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136